


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 28 శుక్రవారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 164
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# పోలింగ్ ప్రశాంతం

- ఏపీ, తెలంగాణలో ఎమ్మెల్సీ స్థానాలకు ముగిసిన పోలింగ్
- తెలుగు రాష్ట్రాల్లో 6 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- ఆంధ్రప్రదేశ్‌లో 3 స్థానాలకు.. తెలంగాణలో 3 స్థానాలకు ఎన్నికలు
- నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 90 శాతం పోలింగ్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు ముగిశాయి. అక్కడక్కడ చిన్న చిన్న గొడవలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌లో 3 స్థానాలకు.. తెలంగాణలో 3 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. పోలింగ్ వద్ద ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మార్చి 3వ తేదీన ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదు అయింది. కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి ఎన్టీఆర్ జిల్లాలో 61.99 శాతం నమోదు అయింది. నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 90 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. పెద్దపల్లిలో అత్యధికంగా 77.95 శాతం పోలింగ్ నమోదైంది. బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించడంతో ఫలితాలు వెల్లడించడానికి రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ లను తరలించి... గట్టి బందోబస్తును

## 2 రాష్ట్రాలకు కృష్ణా
# నీటి కేటాయింపులు

- శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో 70 టీఎంసీల నీళ్లు మాత్రమే
- 2 తెలుగు రాష్ట్రాలు అత్యంత పొదుపుగా నీటిని వాడుకోవాలి
- ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష చేసుకుని.. నీటిని విడుదల చేసుకునే విధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధికారులకు సూచనలు
- సాగర్ ఎడమ కాలువ నుంచి తెలంగాణ అవసరాలకు 9 వేల క్యూసెక్కుల నీరు
- సాగర్ కుడి కాలువ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 7 వేల క్యూసెక్కుల నీరు

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

తెలుగు రాష్ట్రాల మధ్య కీలక ప్రాజెక్టుల నుంచి నీటి కేటాయింపుల విషయంలో స్పష్టత వచ్చింది. వేసవి కాలంలో సాగునీరు, ముఖ్యంగా తాగునీటి కోసం శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నీటి కేటాయింపులను కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ పూర్తి చేసింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో 70 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయని.. రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత పొదుపుగా నీటిని వాడుకోవాలని సూచించింది. ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష చేసుకుని.. నీటిని విడుదల చేసుకునే విధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధికారులకు సూచనలు చేసింది. ఇక, నీటి కేటాయింపుల విషయానికొస్తే శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాల్లో తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. పంటల అవసరాలకు అనుగుణంగా రెండు తెలుగు రాష్ట్రాలకు నీటి విడుదలకు అంగీకారం కుదిరింది. ఫిబ్రవరి 24 నాటికి రెండు ప్రాజెక్టులలో 70 టీఎంసీల నీటి లభ్యత ఉంది. దీంతో సాగర్ ఎడమ కాలువ నుంచి తెలంగాణ అవసరాలకు 9 వేల క్యూసెక్కు నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నారు. నాగార్జున సాగర్ కుడి

## ఎస్సెల్బీసీ వద్ద
# ఉద్రిక్తత



- ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లకుండా హరీశ్ రావును అడ్డుకున్న పోలీసులు
- సహాయక కార్యక్రమాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లే ప్రయత్నం
- చెక్ పోస్టు వద్ద అడ్డుకున్న పోలీసులు
- పోలీసుల తీరును నిరసిస్తూ బైఠాయించిన హరీశ్

2

## గత సర్కార్
# వైఫల్యమే

- ఎస్ఎల్‌బీసీ పాపం గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే: ఉత్తమ్
- గత ప్రభుత్వం నీటి తొలగింపు పనులు చేపట్టి ఉంటే ప్రమాదం జరగకపోయేదన్న మంత్రి
- 2 రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని వెల్లడి
- హరీశ్‌రావు రాజకీయం చేయాలని చూస్తున్నారు

2

నాగర్‌కర్నూల్-నవభూమిబ్యూరో

ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమేనని తెలంగాణ మంత్రి ఉత్తమ్



# చారిత్రక తప్పిదమే..

- అసెంబ్లీకి రాకపోవడంపై వైసీపీ అధినేత జగన్ నిర్ణయాన్ని తప్పుపడుతున్న విశ్లేషకులు
- కూటమి ప్రభుత్వాన్ని ముప్పు తిప్పలు పెట్టాలంటే అసెంబ్లీకి హాజరుకావడమే మంచిది
- గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష పాత్రలో జగన్ తీరును గుర్తు చేస్తున్న విశ్లేషకులు
- సర్కార్‌ను ప్రశ్నిస్తూనే ప్రజల్లోకి వెళ్లి,ప్రభుత్వ వైఫల్యాలను ప్రచారం చేయడం వల్లే జగన్ అధికారంలోకి..

2



అమరావతి-నవభూమిబ్యూరో

మాజీ సీఎం జగన్ నిర్ణయం సరి కాదా. సొంత పార్టీలోనే జగన్ నిర్ణయం పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం పైన ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని చెబుతున్న జగన్ దానికి తనకు అనుకూలంగా మలచుకునే అవకాశాలను వదులుకుంటున్నారనే చర్చ పార్టీలో వినిపిస్తోంది. జగన్ జిల్లాల పర్యటన ఆలస్యం అవుతోంది. ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో జగన్ మంచి ఛాన్స్ మిస్ చేసుకుంటున్నారనే అభిప్రాయం పార్టీలో వినిపిస్తోంది. తన రాజకీయ మూలాలు మర్చిపోతున్నారనే చర్చ కొనసాగుతోంది. జగన్ నిర్ణయంతో మాజీ సీఎం జగన్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలి రోజు హాజరయ్యారు. జగన్ ఇక సభకు వస్తారని అందరూ భావించారు. గవర్నర్ ప్రసంగం సమయంలో పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష హోదా కోసం నిరసన తెలిపి.. ఆ వెంటనే అందరూ అసెంబ్లీ వాకౌట్ చేసారు. జగన్ చేస్తున్న డిమాండ్ అమలు పైన భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పార్లమెంట్ , ఏపీ ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నిర్ణయాలను గుర్తు చేస్తున్నారు. అయితే, కూటమి నేతలు మాత్రం ఈ అయిదేళ్లు కాలంలో జగన్ కు ప్రతిపక్ష హోదా రాదని తేల్చి చెబుతున్నారు. ఇదే విషయాన్ని పవన్ స్పష్టం చేసారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలో సూపర్ సిక్స్ లో కీలక హామీలను అమలు చేయ లేదు. 2014-19 జగన్ పథకాల పైన ప్రజల్లో చర్చ జరుగుతోంది. ప్రతిపక్ష హోదా కోసం జగన్ న్యాయ పోరాటం చేస్తు న్నారు. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అవకాశం ఉన్న సమయంలో సభకు హాజరై..ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశాన్ని జగన్ వదులుకున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. తనకు మాట్లాడే ఛాన్స్ ఇవ్వరనేది జగన్ వాదన. అయితే, జగన్ కు మాట్లాడేందుకు మైక్ ఇవ్వకపోయినా.. అధికార పార్టీ నుంచి ఎలాంటి ప్రతికూల స్పందన కనిపించినా.. రాజకీయంగా జగన్ కే కలిసి వస్తుందని వైసీపీ నేతలు అంతర్గత చర్చల్లో అంగీకరిస్తున్నారు. 2014 ఎన్నికల్లో 67 సీట్లు గెలిచిన జగన్ నాడు ప్రతిపక్ష పాత్ర పోషించారు. సభలో తన వాదన

# సవాళ్లు..ప్రతి సవాళ్లు!

- సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం
- ఇద్దరి మధ్య సవాళ్లు..ప్రతి సవాళ్లు
- తెలంగాణ సీఎంగా రేవంత్ ఉండటం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం: కిషన్‌రెడ్డి
- మెట్రో విస్తరణ అంశం కేబినెట్ ముందుకు రానివ్వకుండా కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు..
- కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టనర్..సీఎం రేవంత్ ఆరోపణ

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివి గాలి మాటలని.. బెదిరింపు రాజకీయాలకు తాను భయపడనని చెప్పారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీ యాలు మానుకోవాలని హితవు పలికారు. నిజంగా రేవంత్‌కు ధైర్యం ఉంటే తాను మెట్రో ను అడ్డుకున్నా అనే విషయం నిరూపించా లన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలు మెట్రోపై ప్లానింగ్ ఉందా? అని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీని అడిగి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రజలకు హామీలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. హామీలు, పథకాల అమలు విషయంలో తమపై తోసేసి చేతులు దులిపేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పథకాలకు అవసరమైన వనరులు సమకూర్చుకోవాల్సిన బాధ్యత సీఎంకు లేదా? అని గళమెత్తారు. తాను మెట్రోను అడ్డుకున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. నిజంగా రేవంత్‌కు దమ్ము, ధైర్యం ఉంటే ఆరోపణలను నిరూపించాలని తెలిపారు. సీఎం స్థాయి వ్యక్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి వ్యక్తి తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీతో భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ కిషన్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని సీఎం ఆరోపించారు. కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్టనర్.. కేసీఆర్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని దుయ్యబట్టారు రేవంత్. మెట్రో విస్తరణలో

# ఓటెత్తిన ఉత్తరాంధ్ర..

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 86 శాతం పోలింగ్
- చైతన్యం చూపించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల ఓటర్లు
- పోలింగ్ శాతం పెరగడంతో తమకే లాభిస్తుందంటున్న కూటమి నేతలు

2

అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల ఓటర్లు తమ చైతన్యం చూపించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ జరుగుతోంది. ఏపీలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల ఓటర్లు తమ చైతన్యం చూపించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ జరుగుతోంది. ఉద యం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 4 గంటల వరకు జరగనుంది. అయితే.. ఇక్కడ మధ్యాహ్నం 2 గంటల సమయానికే 86 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రకటన చేశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు

## మార్చి 1 నుంచి
# గుట్ట బ్రహ్మోత్సవాలు

- మార్చి 1 నుంచి 11 వరకు బ్రహ్మోత్సవాలు
- మార్చి 7న ఎదుర్కోలు మహోత్సవం
- 8న తిరు కళ్యాణోత్సవం,9న దివ్య విమాన రథోత్సవం కళ్యాణాలు, హెూమాలు, జోడు సేవలు, ఏకాదశి
- లక్ష పుష్పార్చన సేవలను రద్దు: ఈఓ భాస్కర్‌రావు వెల్లడి

2




హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. యాదగిరిగుట్ట ఆలయంలో మార్చి 1 నుంచి 11 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మార్చి 7న ఎదుర్కోలు మహోత్సవం, 8న తిరు కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నా రు. మార్చి 9న దివ్య విమాన రథోత్సవం జరగనుంది. బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఆలయంలో కళ్యాణాలు, హెూమాలు, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చన సేవలను రద్దు చేసినట్లు యాదగిరిగుట్ట ఆలయ అధికారులు తెలిపారు. కాగా, యాదగిరిగుట్టలో పంచనారసింహస్వామి పుణ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఈ ఏడాదితో 70 సంవత్సరాలు

# రాజమౌళి నెంబర్ 1 జాదూ

- పోలీసులకు ఓ లేఖ రాసిన నిర్మాత శ్రీనివాసరావు
- రాజమౌళికి క్షుద్ర పూజలు తెలుసని,ఎవరినైనా లోబర్చుకుంటాడు
- రాజమౌళి టార్చర్‌ను భరించలేకపోతున్నానని... ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియో విడుదల

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలుగు సినీ పరిశ్రమ ఖ్యాతిని ప్రపంచ నలుమూలలకు చాటిన దర్శక దిగ్గజం రాజమౌళి వివాదంలో చిక్కుకున్నారు. రాజమౌళిపై ఆయన స్నేహితుడు శ్రీనివాసరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజమౌళి టార్చర్ ను భరించలేకపోతున్నానని... ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తనకు చావు ఒక్కటే మార్గమని, ఇదే తన మరణ వాంగ్మూలం అంటూ పోలీసులకు ఓ లేఖ రాశారు. ప్రస్తుతం ఈ వ్యవహారం సంచలనంగా మారింది. ఈ మేరకు ఆ లేఖలో, వీడియోలో ఏం చెప్పారంటే.. తనకు రాజమౌళితో 34 ఏళ్ల నుంచి స్నేహం ఉందని.. రాజమౌళి డైరెక్టం గా ఎదగడానికి తన జీవితం మొత్తం ధార పోశానని చెప్పారు. ఆయన కోసమే ఇప్పటివరకు పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్ గానే మిగిలిపోయానన్నారు. రాజమౌళి వల్లే నా జీవితం నాశనం అయ్యిందని.. ఇప్పుడు తనని టార్చర్ చేస్తున్నారని తెలిపారు. యమదొంగ సినిమాలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా టైటిల్స్ లో కూడా తన పేరు వేశారని గుర్తు చేశారు. కావాలంటే చెక్ చేసుకోండి అని పేర్కొన్నారు. తాను పబ్లిసిటీ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం లేదని.. ఎమ్ ఎమ్ కీరవాణి, గుణ్ణం గంగరాజు, చంద్ర శేఖర్ యేలేటి, హను రాఘవపూడి, మైత్రీ మూవీస్ చెర్రీ ఇలా చాలామందితో కలిసి తాను పనిచేశానన్నారు. వారందరికీ కూడా రాజమౌళితో తన స్నేహం గురించి తెలుసని ప్రస్తావించారు. అంతే కాకుండా రాజమౌళికి క్షుద్ర పూజలు తెలుసని, అందుకే ఆయన సినిమాలు హిట్ అవుతున్నాయని, ఆ విద్యతో ఎవరినైనా ఆయన లోబరచుకోగలరని పేర్కొన్నారు. అయితే ఆ లేఖలో ఆయన పేర్కొన్న విషయాలు నమ్మశక్యంగా లేకపోవడంతో కావాలనే ఆరోపణలు చేస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాజమౌళిని కావాలనే టార్గెట్ చేసుకున్నారా అనే అనుమానాలు నెలకొన్నాయి. రామాయణం, మహాభారతం ఒక మహిళ వల్ల జరిగాయంటే ఏమో అనుకున్నామని.. కానీ, ఒక మహిళ వల్ల వారి జీవితం ఇలా అవుతుందని కలలో కూడా ఊహించుకోలేదన్నారు. అందరి జీవితాల్లో మాదిరే వారి లైఫ్‌లోకి ఒక అమ్మాయి ప్రవేశించిందని.. ముందు రాజమౌళితోనే ఆమెకు పరిచయం.. ఆ తర్వాత తనతో కూడా స్నేహం కుదిరిందన్నారు. ఆర్య2 సినిమా కథ మాదిరే తమ స్టోరీ ఉంటుందని.. మేము ముగ్గురం క్లోజ్ కాబట్టి ఏం చేద్దాం అంటూ రాజమౌళిని అడిగానని.. ఆ అమ్మాయిని వదిలేయాలని రాజమౌళినే తనని కోరాడు అని చెప్పారు. అందుకు తాను ఒప్పుకోలేదని.. ముగ్గురం కలిసే ఉందామని చెప్పానన్నారు.

## వక్ఫ్ బిల్లుకు
# కేబినెట్ ఆమోదం

- జేపీసీ రిపోర్ట్ ఆధారంగా వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం
- జేపీసీ ప్రతిపాదించిన 23 మార్పులలో 14 మార్పులను మంత్రివర్గం ఆమోదం
- మార్చి 10న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల
- రెండో భాగంలో వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ క్రమబద్ధీకరణ బిల్లు


2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రిపోర్ట్ ఆధారంగా వక్ఫ్ సవరణ బిల్లుకు ఫిబ్రవరి 19న జరిగిన సమావేశంలో కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు తెలుస్తోంది. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రిపోర్ట్ ఆధారంగా వక్ఫ్ సవరణ బిల్లుకు ఫిబ్రవరి 19న జరిగిన సమావేశంలో కేంద్ర కేబినెట్ ఆమోదించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా జేపీసీ ప్రతిపాదించిన 23 మార్పులలో 14 మార్పులను మంత్రివర్గం ఆమోదించిందని సమాచారం. ఈ నేపథ్యంలో మార్చి 10న కీలక పరిణామం చోటు చేసుకోనుందని తెలుస్తోంది. అవును... ఈ ఏడాది జరిగిన బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో పార్లమెంటులో ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్య ఈ నివేదికను ఉభయసభల్లోనూ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో రెండు సభల్లోనూ

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉద్రిక్త వాతావరణం.. ప్రయాణికుల ఆందోళన, కారణం ఏంటంటే..?

**హైదరాబాద్-నవభూమి:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికులకు ఆందోళనకు దిగారు. బుధవారం మధ్యాహ్నం పలువురు ప్రయాణికులు నిరసనలు వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లిన స్పైస్‌జెట్ విమానం ఆలస్యం అవడమే ఇందుకు కారణం. విమానంలో సాంకేతిక లోపం తలెత్తటంతో.. విమానం కోసం ప్రయాణికులు దాదాపు మూడు గంటలకు పైగా ఎదురు చూశారు. అయినా విమానం బయలుదేరకపోవడంపై ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఎయిర్‌పోర్ట్ సిబ్బంది ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవటంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కుంభమేళాకు బుధవారం చివరి రోజుని.. విమానం లేటుగా బయల్దేరితే ఎలా చేరుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాగా.. కుంభమేళాలో చివరి రోజు పుణ్య స్నానాలు చేయడానికి 189 మంది ప్రయాణికులు ఎక్స్‌ట్రా డబ్బులు చెల్లించి బుధవారం ఉదయం 10.05 గంటలకు ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనున్న స్పైస్‌జెట్ ఎస్‌జీ-773 విమాన సర్వీస్‌లో టికెట్లను బుక్ చేసుకున్నారు. తీరా విమానాశ్రయానికి చేరుకుంటే.. విమానం సాంకేతిక సమస్యలతో సరైన సమయానికి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరలేదు. దీంతో వారు స్పైస్ జెట్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 1.15 గంటలకు ప్రయాగ్‌రాజ్ విమానం టేకాఫ్ అయిందని ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.కాగా.. ఇదే నెలలోనే ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం దాదాపు ఐదున్నర గంటల పాటు ఆలస్యంగా నడిచింది. ఈనెల 7న శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన ఫ్లైట్ ఆలస్యం కావటంతో ప్రయాణికులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 10:30 గంటలకు బయలుదేరాల్సిన విమానం దాదాపు ఐదున్నర గంటల ఆలస్యంగా సాయంత్రం 4 గంటలకు బయల్దేరింది.



## పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం.. రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం ఇండ్లు లేని పేద ల కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. జనవరి 26న ఈ పథకం ప్రారంభం కాగా.. తొలి విడతగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ పథకం కింద ప్రతి లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు నాలుగు విడతల్లో ఇవ్వనున్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే అన్ని జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. కాగా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ ఖర్చును సాధ్యమైనంత తగ్గించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.ఇందులో భాగంగా.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మేస్త్రీలకు శిక్షణ ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ డిసైడ్ అయింది. తొలి విడతలో మంజూరు చేసిన 72,045 ఇళ్లను సత్వరం నిర్మించి పూర్తి చేయడానికి ఇండ్ల నిర్మాణంలో గట్టితనం, నాణ్యత ఉండేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం. వృథాన్ని తగ్గించడం. ఇంటి నిర్మాణ సామగ్రి వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవడం, భద్రత తదితర అంశాలపై మేస్త్రీలకు శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణలోని 12,672 గ్రామాల నుంచి ఒక్కో మేస్త్రీని ఎంపిక చేసి వారికి ఇళ్ల నిర్మాణంపై ట్రైనింగ్ ఇచ్చేందుకు ప్రణాళికలు రెడీ చేశారు. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో ప్రస్తుతం ఏడు జిల్లా పరిధిలో 82 మంది మేస్త్రీలకు మొదటి బృందంలో ట్రైనింగ్ పూర్తిచేశారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే గ్రామాలకు ఈ మేస్త్రీలను ఎంపిక చేసి ట్రైనింగ్ ఇవ్వనున్నారు.ఇక ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి భారం పడకుండా.. ఒక్కో ఇంటికి కావాల్సిన 8 ట్రాక్టర్ల ఇసుకను ఫ్రీగా ఇచ్చేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఉపాధి కల్పించేలా ఇటుక తయారీ యూనిట్లు ఏర్పాటు చేసి సరఫరా చేయడానికి కూడా అధికారులు చర్యలు చేపట్టారు. 400 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాలో ఇంటిని నిర్మించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకోసం మూడు నమూనాలను సర్కార్ విడుదల చేసింది. తాజాగా.. ఇండ్లు నిర్మించే మేస్త్రీలకు ట్రైనింగ్ ఇచ్చే అంశంపై గృహ నిర్మాణ శాఖ దృష్టిసారించింది.

## అడ్డా కూలీగా వచ్చి కోటీశ్వరుడిగా.. ఏకంగా రూ.100 కోట్లతో, వీడు మామూలోడు కాదు



**హైదరాబాద్-నవభూమి:** అక్షరం ముక్క రాదు. అడ్డా కూలీగా జీవితం ప్రారంభించాడు. అందరితో పరిచయాలు పెంచుకొని నమ్మకాన్ని కూడగట్టుకున్నాడు. చిట్టీల వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. తక్కువ కాలంలోనే కోటీశ్వరుడయ్యాడు. కట్ చేస్తే రూ. 100 కోట్లతో పరారయ్యాడు. ఈ భారీ మోసం హైదరాబాద్ నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా యాడికి మండలం చందన లక్ష్మీంపల్లి గ్రామానికి చెందిన పుల్లయ్య, భూలక్ష్మి దంపతులు. వీరు 18 ఏళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వలస వచ్చారు. బీకేగూడ రవీంద్రానగర్ కాలనీ సమీపాన సీ-టైపు కాలనీలో నివాసం ఉన్నాడు. చదువు లేకపోవడంతో పుల్లయ్య కొన్ని నెలలు పాటు నగరంలో అడ్డాకూలీగా పనిచేశాడు.ఆ తర్వాత స్థానికులతో పరిచయాలు పెంచుకొని కూలి పని మానేశాడు. చిట్టీల వ్యాపారంలోకి అడుగుపెట్టి గత 15 సంవత్సరాలుగా చిట్టీల బిజినెస్ నిర్వహిస్తున్నాడు. రూ. లక్ష నుంచి ప్రారంభించి ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చిట్టీలను నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్ వచ్చిన తొలినాళ్లలో గుడిసెల్లో నివాసమున్న పుల్లయ్య.. తక్కువ కాలంలోనే కోటీశ్వరుడిగా మారిపోయాడు. అదే ఏరియాలో విలాసవంతమైన ఇల్లు కట్టుకున్నాడు. చిట్టీలు పాడుకున్న కస్టమర్లకు డబ్బులు ఇవ్వకుండా అధిక వడ్డీ ఆశచూపేవాడు. ఆ డబ్బులు వారికి ఇవ్వకుండా తన వద్దే ఉంచుకునేవాడు. మళ్లీ అదే సభ్యులతో చిట్టీలు కట్టించుకునేవాడు. అవే కాకుండా కాలనీలో తెలిసిన వారి వద్ద అధిక వడ్డీ ఆశ చూపి రూ.కోట్లు అప్పు చేశాడు. సుమారు 2 వేల మంది వరకు పైసా పైసా కూడబెట్టి పుల్లయ్య వద్ద చిట్టీలు వేశారు.చిట్టీలు వేసిన వారికి ఈనెల 23 నుంచి 26వ తేదీలోపు డబ్బులు చెల్లిస్తానని నమ్మబలికాడు. రెండ్రోజుల ముందే ఈనెల 21నే కుటుంబ సభ్యులతో కలిసి ఎక్కడికో పరారయ్యాడు. సెల్ ఫోన్లనుక కూడా స్విచ్‌ఆఫ్ చేశారు. బుధవారం (ఫిబ్రవరి 26) మధ్యాహ్నం వరకు దాదాపు 700 మందికి పైగా బాధితులు పుల్లయ్య నివాసం వద్దకు చేరుకున్నారు. ఒకరి గోడు మరొకరు చెప్పుకొని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మహిళలలైతే బోరున ఏడ్చేశారు. బాధితుల చెప్పిన లెక్క ప్రకారం దాదాపు రూ.100 కోట్లకు పైగా డబ్బులు చెల్లించకుండా పుల్లయ్య ఉడాయించినట్లు తెలిసింది. ఇంకా చాలా మంది బాధితులు బయటకు రాలేదు. వారు కూడా బయటకు వస్తే ఈ మొత్తం మరింత పెరిగే ఛాన్స్ ఉంది. పుల్లయ్య ఇంట్లో డబ్బులు లెక్కపెట్టేందుకు 5 కౌంటింగ్ మెషీన్లు కూడా ఉన్నాయని బాధితులు వెల్లడించారు.

## ఆలయం కోనేరులో మునిగి గురుకుల విద్యార్థి మృతి

**నాగర్‌కర్నూల్ -నవభూమి:** కల్వకుర్తి మండల పరిధిలోని జేపీ నగర్ ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో విషాదం నెలకొంది. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ కోనేరులోకి పుణ్యస్నానానికి వెళ్లిన విద్యార్థి నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు.వివరాల్లోకి వెళ్తే.. ఎస్సీ గురుకులానికి చెందిన రమేశ్(16) ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నాడు. అయితే నిన్న శివరాత్రి నేపథ్యంలో వెల్దండలోని శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి టెంపుల్‌కు రమేశ్ తన స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడున్న కోనేరులో పుణ్యం స్నానం ఆచరించేందుకు రమేశ్ వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు.దీంతో తోటి స్నేహితులు గురుకుల టీచర్లకు సమాచారం అందించారు. పోలీసులు, టీచర్లు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కోనేరులో ఉన్న నీటిని బయటకు తీసి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం డెడ్‌బాడీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే టీచర్ల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపించారు.

# వామ్మో, ఇలాంటి భార్యలు కూడా ఉంటారా



**హైదరాబాద్-నవభూమి:** భార్యాభర్తల బంధానికి రోజురోజుకు కాలం చెల్లిపోతోంది. పెళ్లి అనే బంధంతో ముడిపడి జీవితంగా ఒకరికి ఒకరిగా ఉంటామని చేతితో చెయ్యేసి ఇచ్చుకున్న మాటను తీసి గట్టున పెట్టేస్తున్నారు. పొరుగింటి పుల్లకూర రుచి.. అన్నట్టుగా ఇంట్లో అందమైన భార్యను, మంచి భర్తను పక్కన పెట్టుకుని భార్యాభర్తలు పక్కచూపులు చూస్తున్నారు. ఇద్దరి మధ్య ప్రేమ లేకపోతే అంతే అనుకుందామా.. ఇలాంటివి కేవలం పెద్దలు కుదుర్చిన వివాహాల్లోనే కాదు.. ప్రేమించి వరించిన జంటల్లోనూ జరుగుతుండటం గమనార్హం. తాజాగా అలాంటి ఘటనే చోటుచేసుకుంది వరంగల్‌లో. ప్రేమించి పెళ్లి చేసుకుని.. జిమ్ ట్రైనర్‌తో వ్యాయామ పాఠాలతో పాటు వ్యామోహ పాఠాలు కూడా నేర్చుకుని.. చివరికి భర్తనే హతమార్చాలని ప్రయత్నించింది ఓ భార్య.ఫిబ్రవరి 20వ తేదీన రాత్రి వరంగల్‌లోని బట్టుపల్లి రోడ్ అమ్మవారిపేట క్రాస్ రోడ్ వద్ద సుమంత్ రెడ్డి అనే యువ డాక్టర్ మీద హత్య యత్నం జరగటం సర్వత్రా సంచలనంగా మారింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ జరిపిన పోలీసులు.. కేసును ఛేదించారు. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తన భార్యే, ప్రియుడితో కలిసి ఈ హత్యకు పథకం పన్నినట్టు పోలీసులు నిర్ధారించారు. వీరిద్దరికి ఓ హెడ్ కానిస్టేబుల్ కూడా సహకరించినట్టు తేల్చారు.

డాక్టర్ సుమంత్ రెడ్డి.. 2016 సంవత్సరంలో ఫ్లోరా మరియాను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. 2018 సంవత్సరంలో సుమంత్ రెడ్డి సంగారెడ్డి పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ పద్ధతిన మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశాడు. ఫ్లోరా సెయింట్ అంథోని స్కూల్‌లో టీచర్‌గా పని చేసింది. అయితే.. పిల్లలు కావడం లేదని ఫ్లోరా మరియా ఓ వైద్యురాలిని కలిసింది. పరీక్షించిన వైద్యురాలు.. థైరాయిడ్ సమస్య కారణంగా పిల్లలు పుట్టడంలేదని తెలిపింది. మందులతో పాటు.. ఫిట్నెస్ సెంటర్‌కి వెళ్లి వ్యాయామం చేయటం వల్ల ఈ థైరాయిడ్ సమస్యను తగ్గించుకోవచ్చని వైద్యురాలు సూచించింది. వైద్యురాలి సలహా మేరకు.. సంగారెడ్డిలోని సిద్దుస్ అనే జిమ్‌కి వెళ్లింది ఫ్లోరా. కాగా.. జిమ్‌లో కోచ్‌గా పని చేస్తున్న సామ్యూల్ ఫిన్నీతో ఫ్లోరాకు పరిచయం ఏర్పడింది. జిమ్‌కు వెళ్లి వ్యాయమం చేసి థైరాయిడ్ సమస్యను తగ్గించుకొమ్మని డాక్టర్ చెప్తే.. ఈవిడ జిమ్‌కు వెళ్లి ట్రైనర్‌తో రొమాన్స్ చేస్తూ ఆయన వ్యామోహంలో పడిపోయింది. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం నెలకొంది. ఈ క్రమంలో.. డాక్టర్ సుమంత్ రెడ్డి ఖాజీపేటలో హాస్పిటల్ పెట్టుకున్నాడు. వరంగల్‌లోని వాసవి కాలనీకి నివాసాన్ని మార్చాడు. ఫ్లోరా కూడా రంగశాయిపేట సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీలో జాబ్ చేసింది. కాలేజీ నుంచి ఇంటికి వచ్చాక సామ్యూల్‌తో ఫోన్లు, వీడియో కాల్స్ మాట్లాడుతుండేది. భర్త లేని సమయంలో సామ్యూల్‌ను ఇంటికి కూడా రప్పించుకునేది. వీళ్ల యవ్వారం ఓ రేంజ్‌లో జరుగుతుండగా.. ఈ విషయం డాక్టర్ సుమంత్ రెడ్డికి తెలిసింది. భార్యపై ప్రేమతోనే.. ఇది సరైన పద్ధతి కాదని, ఇద్దరినీ మందలించాడు డాక్టర్ సుమంత్ రెడ్డి.కానీ.. తమ భర్త మీది ప్రేమను జిమ్ ట్రైనర్ మీదికి ఎన్నడో మళ్లించిన ఫ్లోరా.. సుమంత్ రెడ్డి నుంచి విడాకులు కోరింది. సుమంత్ రెడ్డి విడాకులకు నిరాకరించటంతో.. భర్తను ఎలాగైనా అడ్డు తొలిగించుకోవాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో.. ఎవ్వరికీ అనుమానం రాకుండా ఉండాలని స్వయంగా ఫ్లోరానే స్కెచ్ వేసింది. ఎవరికో కాదు.. తన ప్రియుడికే ప్లాన్ చెప్పి సుపారీ కూడా ఇచ్చింది. లక్ష రూపాయలు అడ్వాన్స్ ఇచ్చింది.

ఇంకేముందు.. సామ్యూల్ కూడా తనవంతుగా మారణాయుధాలు రెడీ చేసుకున్నాడు. వీళ్లకు తోడుగా సామ్యూల్ ఫ్రెండ్ సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజు కూడా ప్లాన్‌లో భాగమయ్యాడు. అనుకున్నట్టుగా మర్డర్ సాఫీగా జరిగితే కానిస్టేబుల్‌కు ఇల్లు కట్టిస్తామని ఫ్లోరా మరియా డీల్ కుదుర్చుకుంది కూడా.ఇక.. ఫిబ్రవరి 20 రోజున రాత్రి.. సుమంత్ రెడ్డి హాస్పిటల్ ముగించుకొని కార్‌లో ఇంటికి వెళ్తున్న సమయంలో సామ్యూల్, ఏఆర్ కానిస్టేబుల్ రాజు అతన్ని వెంబడించారు. బట్టుపల్లి శివారు చీకటి ప్రదేశంలోని ఒక బ్రిడ్జ్ వద్దకు చేరుకోగానే సుత్తితో కార్ వెనక ఇండికేటర్ పై కొట్టారు. ఆ శబ్దానికి అతడు కార్ కొద్దిగా ముందుకు వెళ్లి ఆపి.. కార్ దిగాడు. ఇండికేటర్ వద్దకు వచ్చి చూస్తుండగా నిందితులు అనుకున్న ప్రకారం.. సుత్తితో దాడి చేశారు. అయితే.. అనుకోని విధంగా.. సుత్తి దెబ్బ నుంచి డాక్టర్ త్రుటిలో తప్పించుకున్నాడు. దీంతో.. ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

# గత సర్కార్ వైఫల్యమే

(1వపేజీ తరువాయి)కుమార్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం సొరంగంలో నీటి తొలగింపు పనులు చేపట్టి ఉంటే ఇప్పుడు ఈ ప్రమాదం జరిగేది కాదని ఆయన అన్నారు. ఎస్ఎల్‌బీసీ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆయన, రెండు రోజుల్లో సహాయక చర్యలను పూర్తి చేస్తామని తెలిపారు. రెండు నెలల్లో తిరిగి సొరంగం తవ్వకాల పనులు చేపడతామని వెల్లడించారు. గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలు తీసుకునే ప్రాజెక్టును పక్కన పెట్టారని, ఈ టన్నెల్‌ను పూర్తి చేసి ఉంటే 4.50 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవని ఆయన అన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన ప్రాజెక్టులన్నీ వాళ్ల జేబులను నింపుకోవడానికేనని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును కడితే అది మూడేళ్లకే కూలిపోయిందని అన్నారు.

గతంలో శ్రీశైలం పవర్ ప్లాంటులో అగ్ని ప్రమాదం జరిగి ఆరుగురు ఉద్యోగులు మృత్యువాత పడితే కేసీఆర్ వెళ్లి చూడలేదని విమర్శించారు. పాలమూరు పంప్‌హౌస్‌లో ప్రమాదం జరిగినప్పుడు కూడా ఆరుగురు చనిపోయారని, అప్పుడూ స్పందించలేదని అన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది భక్తులు చనిపోతే కేసీఆర్ వెళ్లలేదని విమర్శించారు. మాసాయిపేట రైలు ప్రమాదంలో చిన్నారులు చనిపోయినప్పుడు కూడా ఆయన పరామర్శించలేదని పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు మాత్రం హరీశ్ రావు ప్రమాదం జరిగిన చోటుకు వచ్చి రాజకీయం చేయాలని చూశారని ధ్వజమెత్తారు. హరీశ్ రావుకు అనుభవం ఉంటే పదేళ్లలో ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. సొరంగంలో నిపుణుల చర్యలకు ఇబ్బంది కాకూడదని అందరినీ లోనికి పంపించడం లేదని వెల్లడించారు. బురద తొలగింపు పనులు జరుగుతున్నట్లు చెప్పారు.

# వక్ఫ్ బిల్లుకు కేబినెట్ ఆమోదం

(1వపేజీ తరువాయి)కార్యకలాపాలు కొద్దిసేపు వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో.. జేపీసీ రిపోర్టుల నుంచి కొన్ని అంశాలు తొలగించారంటూ ప్రతిపక్ష ఎంపీలు ఆరోపించారు. బీజేపీ నేత జగదాంబికా పాల్ నేతృత్వంలోని జేపీసీ.. పక్షపాతంతో వ్యవహరించిందని.. సరైన సంప్రదింపులు లేకుండానే బిల్లును తొందరగా అమలు చేశారని మండిపడింది. ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన నేపథ్యంలో.. పాల్ వక్ఫ్ బిల్లును సభలో ఆవేశపూరితంగా తీసుకురావడానికి ప్రయత్నించారని ఆరోపించింది. అయితే.. ఆ ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. ఇందులో భాగంగా... ప్రతిపక్ష వాదనలు సత్య దూరాలని.. జగదాంబికా పాల్ ప్రతీ ఒక్కరి అభిప్రాయాలు వినడానికి ప్రయత్నించారని, సవరణలను ప్రతిపాదించడానికి అందరికీ తగినంత సమయం ఇచ్చారని ప్యానెల్ సభ్యురాలు, లోక్ సభ ఎంపీ అపరాజిత సారంగి తెలిపారు. ఈ సమయంలో గత వారమే కేంద్ర మంత్రివర్గం జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్టును ఆమోదించిందని.. ఈ నేపథ్యంలో మార్చి 10న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల రెండో భాగంలో ఈ వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను క్రమబద్ధీకరణ బిల్లుకు లైన్ క్లియర్ అయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. మరోపక్క జేపీసీలో బీజేపీ, దాని అనుబంధ పార్టీల నుంచి 16 మంది ఎంపీలు ఉండగా.. ప్రతిపక్ష పార్టీల నుంచి కేవలం 10 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందువల్లే ప్రతిపక్షాల నుంచి వచ్చిన 44 మార్పులు తిరస్కరించబడ్డాయని.. బీజేపీ చేసిన 23 మార్పుల్లో 14 మార్పులను మంత్రి వర్గం ఆమోదించిందని అంటున్నారు.ఈ బిల్లు చట్టంగా మారితే వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులు సభ్యులుగా ఉంటారని అంటున్నారు. దీనిపై స్పందించిన కేంద్రం... వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని చెబుతోంది. అయితే... ఇది మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి అని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ విమర్శించారు! ఈ సందర్భంగా... వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించడంపై ప్రధానంగా విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. హిందూ దేవాదాయ-ధర్మాదాయ పరిషత్తులు, క్రైస్తవుల బోర్డులు, సిక్కుల బోర్డుల్లో ఆయా మతాలవారు తప్పిస్తే వేరే మతాలవారు లేనప్పుడు.. ముస్లింల విషయంలోనే అలా చేయాలనుకోవడం ఏమిటని కాంగ్రెస్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇప్పటికే స్పందించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా.. స్వరణలు వక్ఫ్ ప్రయోజనాల కోసం చేసినవి కావని, ఇవి వక్ఫ్ బోర్డుల్ని నాశనం మేసి, కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని పెంచుతాయని ఆరోపించారు. దీనివల్ల ముస్లింలు తమ మసీదులనూ కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. కాగా... జనవరి 29న ముసాయిదా నివేదికను జేపీసీ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... 15-11 మెజారిటీ ఓటుతో నివేదికను ఆమోదించింది. ఈ సందర్భంగా బీజేపీ సభ్యులు చేసిన 14 సవరణలను కమిటీ ఆమోదించగా.. ప్రతిపక్ష సభ్యులు సూచించిన మార్పులను కమిటీ తిరస్కరించింది! కమిటీ ఆమోదించిన సవరణల ప్రకారం రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ముస్లిం ఓబీసీ వర్గానికి చెందిన ఒక సభ్యుడు ఉంటాడు. ఇదే సమయంలో.. రాష్ట్ర ప్రభుత్వాలు అఘాఖానీ, బోహ్రా వర్గాలకు ప్రత్యేక వక్ఫ్ బోర్డులను ఏర్పాటు చేసే నిబంధనలు కూడా ఈ సవరణల్లో ఉన్నాయి! ఇదే సమయంలో కుటుంబ వక్ఫ్ లో మహిళల వారసత్వ హక్కులను రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించే నిబంధనలు ఉన్నాయి!

# ఓటెత్తిన ఉత్తరాంధ్ర..

(1వపేజీ తరువాయికీలక వ్యక్తుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. వీరిలో పాకాలపాటి రఘువర్మ ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) తరఫున పోటీలో ఉన్నారు. అలానే.. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పీఆర్ టీయూ తరఫున పోటీ చేస్తున్నారు. మరో ముఖ్య నాయకుడు కోరెడ్ల విజయగౌరి యూటీఎఫ్ నుంచి బరిలో ఉన్నారు. మరో ఏడుగురు స్వంతంత్రులుగా కూడా పోటీ చేస్తున్నా.. ప్రధాన పోటీ మాత్రం ఈ ముగ్గురి మధ్యే కొనసాగుతోంది., ఏపీటీఎఫ్ నుంచి బరిలో ఉన్న పాకాలపాటి రఘువర్మకు కూటమి పార్టీల్లో టీడీపీ, జనసేన మద్దతు ఇస్తున్నాయి. మరోవైపు.. ఇదే కూటమికి చెందిన బీజేపీ.. పీఆర్ టీయూ నుంచి బరిలో ఉన్న గాదె శ్రీనివాసుల నాయుడుకు మద్దతు ప్రకటించింది.(ఈ విషయంలో బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి మౌనం వహించారు). అయితే.. వైసీపీ ఇక్కడ ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. ఇదిలావుంటే పోలింగ్ విషయానికి వస్తే.. టీడీపీకి చెందిన రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సహా.. ఇతర నాయకులు ఉత్తరాంధ్రలోనే తిష్ట వేశారు. కూటమి అభ్యర్థిగా ఉన్న రఘువర్మను గెలిపించాలని వారు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో భారీ ఎత్తున ఓటింగ్ జరుగుతోంది. ఇతర రెండు గ్రాడ్యుయేట్ స్థానాలతో పోల్చుకుంటే.. ఉత్తరాంధ్రలో మధ్యాహ్నం 2 గంటలకే 86 శాతం పోలింగ్ నమోదు కావడంతో కూటమి నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల పోలింగ్ సమయం ముగిసే నాటికి 14 శాతం కూడా పూర్తి అవుతుందన్న ఆశాభావంతో ఉన్నారు.

### నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఏపీ ప్రభుత్వం

ఏపీలోని కూటమి ప్రభుత్వం నేడు తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఉదయం 10 గంటలకు అసెంబ్లీలో మంత్రి పయ్యావుల కేశవ్, మండలిలో మరోసారి మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. సూపర్ 6 పథకాలు, రాజధాని అమరావతి నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## పోలింగ్ ప్రశాంతం

(1వపేజీ తరువాయి)ఏర్పాటు చేయనున్నారు. ఏపీలో వైసీపీ పోటీ చేయకపోవడంతో టీడీపీ ప్రధానంగా పోటీలో నిలిచింది. ఇక తెలంగాణలో బీజేపీ మూడు స్థానాల్లో పోటీ చేసింది. కాంగ్రెస్ ఒక్క స్థానంలో బరిలో నిలవగా.. బీఆర్ఎస్ పోటీ చేయకపోవడం గులాబీ నేతలను ఆందోళనకు గురి చేసింది.

## ఎస్సెల్బీసీ వద్ద ఉద్రిక్తత

**నాగర్‌కర్నూల్-నవభూమిబ్యూరో**

బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావును ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సొరంగంలో చిక్కుకు పోయిన 8 మందిని కాపాడేందుకు 4 రోజులుగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సహాయక చర్యలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లేందుకు హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు.దీంతో హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలు పోలీసుల చర్యను నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.అయితే చివరికి నలుగురు మాత్రమే వెళ్లేందుకు అనుమతించారు. పూర్వనల్లగొండ,మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ నేతలు తాము కూడా వెళ్తామని ఆందోళన మొదలు పెట్టారు.

## సవాళ్లు..ప్రతి సవాళ్లు!

(1వపేజీ తరువాయి)తనకు పేరు వస్తుందని, కేసీఆర్ హయాంలో ఇది జరగలేదు కాబట్టి.. తన హయాంలో జరగవద్దు అని కిషన్ రెడ్డి భావిస్తున్నారన్నారు. అందుకే కిషన్ రెడ్డి మెట్రో విస్తరణ ప్రాజెక్టును క్యాబినెట్ లో అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రధానికి ఇచ్చిన విజ్ఞప్తులను బాధ్యత వహించి కేబినెట్ ఆమోదం తేవాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే అని సీఎం ప్రస్తావించారు.మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి సాధించుకుని వస్తే ఆయనకు బహిరంగ సభ పెట్టి సన్మానం చేస్తామని.. గండపెండేరం తొడుగుతానని తెలిపారు.

## మార్చి 1 నుంచి గుట్ట బ్రహ్మోత్సవాలు

(1వపేజీ తరువాయి)పూర్తవుతాయి. కృష్ణశిలతో పునర్ నిర్మితమైన ఆలయంలో మూడోసారి జరగనున్నాయి ఈ వేడుకలు. తాజాగా, 50.5 అడుగుల ఎత్తు, ఐదంతస్తుల కృష్ణశిల విమాన గోపురం బంగారు కవచాలతో రూపొంది మహా దివ్యంగా దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1న ప్రారంభమై 11న సహస్ర ఘటాభిషేకంతో ముగుస్తాయి. కాగా, యాదాద్రిలో నరసింహస్వామి వారు ఉగ్ర, జ్వాలా, యోగ, గండబేరుండ, శ్రీలక్ష్మీ సమేత నారసింహుడిగా ఈ క్షేత్రంలో కొలువై ఉన్నారు. ఉగ్ర ఆకృతిలో వ్యాఘ్ర రూపంలో భయాన్ని తొలగిస్తారు. బాధల నుంచి విముక్తి కలిగించే దయామయుడిగా అఖండ జ్యోతి స్వరూపంలో అభయమిస్తారు. నమ్మికొలిచినవారికి కొంగుబంగారమై గండబేరుండ రూపంలో దర్శనమిస్తారు. యోగ ముద్రలో భక్తులకు మానసిక ప్రశాంతత కలిగిస్తూ యోగానంద నారసింహుడిగా పూజలందుకుంటారు. ఈసారి బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగినట్లుగా ప్రభుత్వం, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## 2 రాష్ట్రాలకు కృష్ణా నీటి కేటాయింపులు

(1వపేజీ తరువాయి)కాలువ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 7 వేల క్యూసెక్కుల విడుదలకు ఆమోదం తెలిపారు. శ్రీశైలం నుంచి తెలంగాణకు కొనసాగనున్న 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. శ్రీశైలం నుంచి ఏపీలోని మల్యాల, హంద్రీనీవా నుంచి 2200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నారు. తాగునీటికి ప్రాధాన్యత ఇస్తూనే పంటలను కాపాడుకునేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని తెలంగాణ, ఏపీకి కేఆర్‌బీఎం సూచించింది. రెండు ప్రాజెక్టుల్లో తక్కువ నీరు ఉన్నందున నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ రెండు తెలుగు రాష్ట్రాలకు స్పష్టం చేసింది.

## చారిత్రక తప్పిదమే..

(1వపేజీ తరువాయి)సమర్ధవంతంగా వినిపించారు. సభలో తనకు మాట్లాడే అవకాశం దక్కటం లేదని ప్రజలు గ్రహించే లా చేసి..ఆ తరువాత ప్రజల్లోకి వెళ్లటం ద్వారా మద్దతు లభించింది. అవకాశం వదులుకుంటున్నారా జగన్ కు సభలో ఎలాంటి పరి స్థితులనైనా ఎదుర్కోవటం కొత్త కాదని వైసీపీ నేతలు గుర్తు చేస్తున్నా రు. జగన్ ను రాజకీయంగా ఇబ్బంది పెట్టారనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటం ద్వారానే ప్రజల్లో అంతగా ఆదరణ పెరిగింది. ఆ మూలాలను పార్టీ సీనియర్లు గుర్తు చేస్తున్నారు. జగన్ సభకు హాజ రు కాకుండా బయట మీడియా సమావేశాలు నిర్వహించటం ద్వారా ప్రజల్లో సానుకూలత రాదనే అభి ప్రాయం వినిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పరిణామాల పైన సభలో నిలదీ సే అవకాశం గోల్డెన్ ఛాన్స్ జగన్ మిస్ చేసుకున్నారనే అభిప్రాయం నెలకొంది. బడ్జెట్ పైన సభలో చర్చ జరిగే సమయంలో పార్టీ ఎమ్మెల్యేలు సైతం హాజరు కాకపోవటం పైన విమర్శలు వినిపిస్తున్నాయి. మరి.. జగన్ తన వైఖరి మార్చుకుంటారా.. లేక, దీనిని కొనసాగిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

## పోసాని కృష్ణమురళికి 14 రోజుల రిమాండ్

**రైల్వే కోడూరు-నవభూమి:**-వైసీపీ నేత, నటుడు పోసాని కృష్ణమురళికి రైల్వే కోడూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆయనను కడప సెంట్రల్ జైలుకు తరలించే అవకాశం ఉంది. గురువారం అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సుమారు 9 గంటల పాటు విచారించిన పోలీసులు రాత్రి జడ్జి ముందు హాజరుపరిచారు.

HOUSE FOR SALE
Janapriya Avenue, 2BHK,
650.sq.ft, satyanagar Colony,
Kothapet, 1floor, 28 Lakhs-
price negotiable.
Ph:9246574671



## చెరుకు తోటలో దాక్కున్న నిందితుడు.. పోలీసులు ఏం చేశారంటే..


దేశరాజధానిలో నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్ని మార్పులు చేసినా మహిళలపై అత్యాచారం ఘటనల సంఖ్య కొంచెం కూడా తగ్గడం లేదు. తాజాగా పూణెలో పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలోనే ఓ వ్యక్తి ఏ మాత్రం భయం లేకుండా మహిళపై అత్యాచారం చేసి పరారయ్యాడు. దీంతో ఈ ఘటన మహారాష్ట్రలో రాజకీయంగా కలకలం రేపుతోంది. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితుడిని ఎవరనేది పోలీసులు గుర్తించినా..మహారాష్ట్రలోని పూణెలో రద్దీగా ఉండే స్వర్గేట్ బస్టాండ్‌లో మంగళవారం ఉదయం ఆగి ఉన్న బస్సులో 26 ఏళ్ల మహిళపై అత్యాచారం జరిగింది. ఈ సంఘటన పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో జరిగింది. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితుడు దత్తాత్రేయ రాందాస్ (36) గాడేగా గుర్తించారు పోలీసులు. ఇతడిపై ఇప్పటికే దొంగతనం, దోపిడి కింద 6కు పైగా కేసులున్నాయి. 2019 నుంచి బెయిల్‌పై బయట తిరుగుతున్న దుండగుడు తాజాగా మహిళపై అఘాయిత్యం చేసి పారిపోయాడు.నిందితుడిని పట్టిస్తే రూ.లక్ష..నిందితుడిని పట్టుకునేందుకు 13 ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనా స్థలానికి దగ్గర్లో ఉన్న చెరకు తోటలో డ్రోన్లతో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కాగా, అత్యాచారం చేశాక నిందితుడు సమీపంలోనే ఉన్న చెరకు తోటలో దాక్కుని.. కాసేపయ్యాక కూరగాయలు తీసుకెళ్తున్న ట్రక్కులో తప్పించుకుని వెళ్లాడని పోలీసులు చెబుతున్నారు. నిందితుడిని పట్టించినవారికి రూ.లక్ష బహుమతిని ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే స్పందించారు. త్వరలో నిందితుడి పట్టుకుంటామని హామీ ఇచ్చారు.

## స్కూల్ బాలికలపై లైంగిక వేధింపులు, మత మార్పిడి.. ఆ నగరంలో ఉద్రిక్తత



**జైపూర్-నవభూమి:** స్కూల్ బాలికలను ఆకట్టుకుని వారిని లైంగికంగా వేధించడంతో పాటు బ్లాక్‌మెయిల్ చేసి బలవంతంగా మత మార్పిడి చేస్తున్నట్లు కొన్ని కుటుంబాలు ఆరోపించాయి. దీంతో స్థానికులు నిరసనలు చేపట్టారు. బంద్ పాటించారు. ఈ నేపథ్యంలో ఆ నగరంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రాజస్థాన్‌లోని బేవార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మసుదాలో ఒక మతానికి చెందిన వారు మరో మతానికి చెందిన స్కూల్ అమ్మాయిలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కొందరు వ్యక్తులు సోషల్ మీడియా ద్వారా బాలికలతో పరిచయం పెంచుకున్నారు. చైనీస్ మొబైల్ ఫోన్‌లను వారికి బహుమతిగా ఇచ్చి ఆకట్టుకున్నారు. ఆ అమ్మాయిలను లైంగికంగా వేధించారు. ఆ చర్యలను రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్ చేశారు. మతం మారాలని వారిని బలవంతం చేశారు.కాగా, బాధిత బాలికల కుటుంబాలు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఈ విషయం తెలియడంతో స్థానికులు నిరసనలు చేపట్టారు. మసుదా, సమీప ప్రాంతాల్లో మార్కెట్లు మూసివేసి బంద్ పాటించారు. దీంతో మతపరమైన ఆందోళనలతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.మరోవైపు బాధిత బాలికల ఫిర్యాదులపై పోలీసులు స్పందించారు. మాజీ కౌన్సిలర్ హకీమ్ ఖురేషి, ముగ్గురు మైనర్ బాలురతో సహా 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు మసూదా డీఎస్పీ సజ్జన్ సింగ్ తెలిపారు. నలుగురు నిందితులైన లుక్మాన్, సోహైల్ మన్సూరి, ర్యాన్ మొహమ్మద్, అఫ్రాజ్‌ను ఐదు రోజుల పోలీస్ రిమాండ్ తర్వాత కోర్టులో ప్రవేశపెట్టి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు చెప్పారు.


## మైతీలు వెనక్కి తగ్గారా ?.. మణిపూర్ గవర్నర్‌కు ఆయుధాలు అప్పగింత !




**ఇంపాల్-నవభూమి:** మైతీ వర్గానికి చెందిన అరంబై తెంగోల్ సభ్యులు.. మణిపూర్ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు.. ఇవాళ ఆయుధాలను సరెండర్ చేశారు. ఈనెల 25వ తేదీన గవర్నర్ భల్లాతో జరిగిన మీటింగ్ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. మణిపూర్‌లో కొన్నాళ్లుగా రెండు తెగల మధ్య ఘర్షణ చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. హింసాత్మకంగా మారిన ఆ ఘర్షణల్లో వందల సంఖ్యల జనం మరణించారు.రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో 104 తుపాకులను, మందుగుండు సామాగ్రిని ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. కంగ్‌పోక్పీ, ఇంపాల్ ఈస్ట్, బిష్ణుపూర్, తౌబాల్, ఇంపాల్ వెస్ట్, కాక్‌చింగ్ జిల్లాల్లో ఆయుధాలను అప్పగించారు. ప్రభుత్వ దళాల నుంచి అక్రమంగా లూటీ చేసిన ఆయుధాలను వారం రోజుల్లోగా సరెండ్ చేయాలని ఫిబ్రవరి 20వ తేదీన రాష్ట్ర ప్రజల్ని గవర్నర్ కోరారు.ఈ నేపథ్యంలో అరంబై తెంగోల్ గ్రూపు సభ్యులు ఇవాళ ఆయుధాలను అప్పగించారు. ఆయుధాలను సరెండర్ చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం తెలిపింది. తమ షరతులకు అంగీకరిస్తే ఆయుధాలు సరెండర్ చేస్తామని మైతీ గ్రూపు పేర్కొన్నది. ఆ సంస్థ పీఆర్వో రాబిన్ మాన్‌గంగ్ కవైరక్‌పార్.. గ్రూపు తరపున గవర్నర్‌ను కలిశారు. ఆయుధాల అప్పగింతకు గడవు వెల్లడించలేదు.

గవర్నర్ భల్లాకు అరంబై తెంగోల్ ఓ మెమోరండంను సమర్పించింది. మెజారిటీ మైతీ వర్గానికి ఎస్టీ స్టాటస్ ఇవ్వాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. మైతీ తెగలకు ఎస్టీ హోదా ఇవ్వాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ.. 2023 మే నెలలో మణిపూర్‌లో భారీ ప్రదర్శన జరిగింది. ఆ తర్వాత ఆ రాష్ట్రంలో ఊచకోత ప్రారంభమైంది. కుక్కీ గిరిజనుల్ని నిర్దాక్షిణ్యంగా చంపినట్లు అరంబై తెంగోల్‌పై ఆరోపణలు వచ్చాయి.మణిపూర్‌లో హింస చోటుచేసుకున్న సమయంలో.. అరాచక శక్తులు .. పోలీసు స్టేషన్లు, ఔట్ పోస్టుల వద్ద ఉన్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. లూటీ అయిన ఆరు వేల ఆయుధాల్లో ఇప్పటి వరకు 2500 ఆయుధాలు మాత్రమే సరెండర్ చేశారు. రెండు వర్గాల హింసలో 260 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 వేల మంది నిరాశ్రయులయ్యారు. మైతీలు హిందూ కులస్థులు. వాళ్లు ఎక్కువ శాతం ఇంపాల్ లోయ ప్రాంతాల్లో నివసిస్తుంటారు. కుక్కీల్లో ఎక్కువ శాతం క్రైస్తవులు ఉన్నారు. వాళ్లు కొండల్లో జీవిస్తుంటారు. అయితే రెండు వర్గాల ప్రజల మధ్య ఇప్పుడు బలోపేతమైన బఫర్ జోన్లను ఏర్పాటు చేశారు.

## తల్లిని దారుణంగా కొట్టి హింసించిన కూతురు..



**చండీగఢ్-నవభూమి:** ఒక కూతురు తన తల్లిని దారుణంగా హింసించింది. జుట్టులాగి చెంపలపై కొట్టింది. పలు చోట్ల కొరికింది. కాలితో తన్నింది. తనను కొట్టవద్దని ఆ తల్లి వేడుకున్నప్పటికి వదిలిపెట్టలేదు. ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హర్యానాలో ఈ సంఘటన జరిగింది. ఒక మహిళ తన తల్లి పట్ల దారుణంగా ప్రవర్తించింది. ఆమె చెంపపై కొట్టింది. జుట్టు పట్టుకుని లాగింది. తల్లి శరీరంపై పలు చోట్ల కొరికింది. ఆమెను కాలితో తన్నింది. హర్యానా భాషలో తిట్టింది. తనను కొట్టవద్దని ఏడుస్తూ ఆ తల్లి వేడుకున్నప్పటికీ కుమార్తె కనికరం చూపలేదు. కొట్టడాన్ని ఆపలేదు.కాగా, ఆ ఇంట్లో రహస్యంగా రికార్డ్ చేసిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కుమార్తె తన తల్లిని దారుణంగా హింసించిన ఈ వీడియో క్లిప్‌పై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. 'ఒక కూతురు తన తల్లిని హింసిస్తోంది. అది అత్తగారు కాదు, తన సొంత తల్లి అని తెలిసి నేను షాక్ అయ్యా' అని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మహిళపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేశారు. హర్యానా పోలీసులతోపాటు సీఎం నయాబ్ సింగ్ సైనీకి ఈ వీడియో క్లిప్‌ను ట్యాగ్ చేశారు.

## పార్టీలో గొడవ.. కోపంలో స్నేహితుడి చెవి కొరికి.. నమిలి మింగేసిన యువకుడు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈమధ్య కాలంలో ఎవరు, ఎప్పుడు, ఎలా ప్రవర్తిస్తున్నారో అస్సలే అర్థం కావట్లేదు. అప్పటి వరకూ బాగానే ఉండి ఒక్కసారిగా నరరూప రాక్షసుల్లా మారిపోతున్నారు. అది అర్థం అయ్యేలోపే ఎదుటి వారిపై దాడులకు తెగ బడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకుంటుండగా.. ఉన్నట్టుండి గొడవ పడ్డాడు. ఆపై తీవ్ర కోపోద్రేకానికి గురై ఓ మిత్రుడి చెవిని కొరికేశాడు. కొంచెం భాగం పూర్తిగా తెగి పడగా.. దాన్ని నమిలి మింగేశాడు. దీంతో విపరీతంగా భయపడిపోయిన స్నేహితులు వెంటనే బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతడు చికిత్స పొందుతున్నాడు. ఆపూర్తి వివరాలు మీకోసం.మహారాష్ట్రలోని థానే జిల్లా కేంద్రంలో దారుణం జరిగింది. హీరానందాని ఎస్టేట్‌లోని సొలిటైర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో 37 ఏళ్ల సినీ నిర్మాత శ్రావణ్ లీఖా, 32 ఏళ్ల ఐటీ ప్రొఫెషనల్ వికాస్ మీనన్ కలిసి నివసిస్తున్నారు. వీరిద్దరూ ముందు నుంచే స్నేహితులు కావడంతో కలిసి ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని ఉంటున్నారు. అయితే ఫిబ్రవరి 26వ తేదీన తమ స్నేహితులను ఇంటికి పిలిచి పార్టీ చేసుకున్నారు. ఈ క్రమంలోనే వికాస్ మీనన్, శ్రావణ్‌ల మధ్య గొడవ ప్రారంభం అయింది.చిన్న విషయం గురించే వాదులాడుకున్న ఈ ఇద్దరు.. ఎవరూ వెనక్కి తగ్గలేదు. స్నేహితులు వద్దని చెబుతుండగానే.. వికాస్ మీనన్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఒక్కసారిగా లేచి తన పక్కనే కూర్చున్న శ్రావణ్ వద్దకు వచ్చాడు. వెంటనే అతడి చెవిని నోటితో అందుకున్నాడు. ఆపై గట్టిగా కొరికేయగా.. కొంతం భాగం తెగి పడింది. దాన్ని అలాగే నోట్లో వేసుకున్న వికాస్ మీనన్.. ఆపై నమిలి మింగేశాడు. ఇలా ఒక్కసారిగా జరిగిన ఈ దారుణ ఘటనలతో స్నేహితులతో పాటు శ్రావణ్ కూడా తీవ్రంగా భయపడిపోయాడు. వెంటనే అంతా అక్కడి నుంచి పరుగులు తీశారు.ముఖ్యంగా ఇంటి బయటకు వచ్చేసిన స్నేహితులు అంతా శ్రావణ్‌ను స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలోనే వైద్యులు పోలీసులకు సమాచారం అందించగా.. హుటాహుటిన రంగంలోకి దిగారు. బాధితుడు శ్రావణ్‌ను విచారించగా.. తన స్నేహితుడు వికాస్ మీనన్‌యే తన చెవిని కొరికి నమిలి మింగేశాడని వివరించాడు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు వికాస్ మీనన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పెట్టుబడుల సదస్సు.. పూరీల కోసం కొట్టుకున్న ఇన్వెస్టర్లు..



**భోపాల్-నవభూమి:** భోపాల్‌లో జరుగుతోన్న మధ్యప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో అనూహ్య పరిణామాం చోటుచేసుకుంది. భోజనాల సమయంలో ఎగబడిన ఇన్వెస్టర్లు పూరీ, సబ్జీ కోసం కొట్టుకున్నారు. ఒకరిపై ఒకరు ప్లేట్లు విసురుకుని నానా హంగామా సృష్టించారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం.. భోపాల్‌లో గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సదస్సు నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సదస్సును ప్రారంభించగా.. 60 దేశాలకు చెందిన ప్రతినిధులు, గౌతమ్ అదానీ సహా దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

ఈ సదస్సుకు హాజరైనవారికి భోజనాలు ఏర్పాటు చేయగా. ఒక్కసారిగా అందరూ డైనింగ్ హాల్‌లోకి దూసుకొచ్చారు. క్యూలైన్‌లో ఒకరి నొకరు తోసుకుంటూ.. ప్లేట్లు లాక్కుంటూ గందరగోళం సృష్టించారు. భోజన సమయంలో ఆహారం తీసుకోవడానికి వెళుతుండగా విరిగిన ప్లేట్లు ఫ్లోర్‌పై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ అవుతోంది. సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల జరిగిందా? హాజరైన వారిలో తీవ్ర నిరాశ వల్ల జరిగిందా? అనే చర్చకు దారితీసింది.

వీడియోను చూసిన నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. 'మధ్యప్రదేశ్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ప్రభుత్వం పెట్టిన ఫ్రీ ఫుడ్ కోసం నకిలీ 'పెట్టుబడిదారులు' చేసిన ఈ హడావిడి, బార్ అసోసియేషన్ ఫంక్షన్లలో ఫుడ్ స్టాల్స్ కోసం లాయర్లు హడావిడి చేస్తారో నాకు గుర్తుకొచ్చింది' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. ఈ పెట్టుబడిదారుల సమ్మిట్‌లో పట్టణాల్లో విధ్వంసాన్ని తెలియజేస్తోంది... త్వరలో, నేతలు, బడా బాబులు కమిషన్‌లో తమ వాటా కోసం కొట్టాడుతారు' అని ఓ నెటిజన్ వ్యంగ్యంగా పోస్ట్ పెడితే.. 'నేను చాలా సమ్మిట్‌లకు హాజరయ్యాను కానీ మధ్యప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో దృశ్యాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి.. ప్రతి ఒక్కళ్లూ భోజనం కోసం కొట్టుకుంటున్నారు' అని ఇంకొకరు పోస్ట్ పెట్టాడు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పెట్టుబడుల కోసం సదస్సు నిర్వహిస్తే.. వీళ్లంతా ఇంత చీప్‌గా బిహేవ్ చేయడం ఏంటి? అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## యూఎస్‌లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న భారత విద్యార్థి..: ఒక్కసారి చూడాలి వీసా ఇవ్వమంటున్న తల్లిదండ్రులు!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉన్నత చదువులు చదివి.. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎన్నెన్నో కలలు కంటూ అమెరికాకు వెళ్లింది. అక్కడే ఉండా బాగా చదువుకుంటున్న ఆమె అనుకోకుండా ఓ రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈక్రమంలోనే ఆమెకు తీవ్ర గాయాలు కాగా కోమాలోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం అక్కడే ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను చూడాలని కన్నీళ్లు పెడుతున్నారు. వీసా కోసం ఎంతగానో ప్రయత్నాలు చేస్తున్నా.. ఏ ఒక్కటీ ఫలించడం లేదు. దీంతో సాయం చేయమంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆపూర్తి వివరాలు మీకోసం.మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన నీలమ్ షిండే కొన్నేళ్ల క్రితమే ఉన్నత చదువులు చదివేందుకు అమెరికాకు వెళ్లారు. బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలనుకుని నీలమ్ షిండే బాగానే కష్ట పడుతోంది. కానీ దురదృష్ట వశాత్తు ఫిబ్రవరి 14వ తేదీన ఆమె కాలిఫోర్నియాలో రోడ్డు ప్రమాదానికి గురైంది. వేగంగా వచ్చిన ఓ కారు నీలమ్ షిండేను ఢీకొట్టగా తీవ్ర గాయాలు అయ్యాయి. తల, ఛాతి భాగంలో ఫ్రాక్చర్‌లు అయ్యాయి. విషయం గుర్తించిన స్థానికులు ఆమెను ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న ఆమె కోమాలోకి వెళ్లింది.

ప్రమాదం జరిగిన రెండు రోజుల తర్వాత నీలమ్ షిండే రూమ్మేట్.. మహారాష్ట్రలోని ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. ప్రస్తుతం ఆమె కోమాలో ఉందని, ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని వివరించింది. దీంతో ఆమె తండ్రి తానాజీ షిండే కన్నీరుమున్నీరు అవుతున్నారు. బిడ్డను కళ్లారా చూసుకోవాలంటూ కుమిలిపోతూనే వీసా కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలే షిండే తల్లి చనిపోగా.. ఆమె తండ్రి ఆ దుఃఖం నుంచి ఇంకా తేరుకో లేదు. ఇంతలోనే షిండేకు ప్రమాదం జరగడంతో.. ఆయన నరకయాతన అనుభవిస్తున్నారు.

అయితే ఈ విషయం తెలుసుకున్న ఎన్సీపీ నాయకురాలు సుప్రియా సూలే.. ఎక్స్ వేదకగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్‌ను సాయం చేయాలని కోరారు. నీలమ్ షిండే అనే విద్యార్థి అమెరికాలో ప్రమాదానికి గురై అక్కడే చికిత్స పొందుతుందని పోస్ట్ చేశారు. అలాగే మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆమె తండ్రి తానాజీ షిండే ప్రయత్నిస్తున్నారని.. అత్యవసర వీసా కోసం దరఖాస్తు కూడా చేసుకున్నట్లు రాసుకొచ్చారు. ఆయన మీరే సాయం చేయాలంటూ కేంద్ర మంత్రిని కోరుతూనే.. భారత దౌత్య కార్యాలయాన్ని కూడా ట్యాగ్ చేశారు.

## ఆ ఒక్క భాషే 25 ఉత్తరాది భాషలను మింగేసింది..: సీఎం ఎంకే స్టాలిన్



**చెన్నై- నవభూమి:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు.. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అంతా త్రిభాషా విధానాన్ని పాటించాలని ఇటీవలే ప్రకటించింది. దీన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా.. ఇద్దరి మధ్య పెద్ద ఎత్తున మాటల యుద్ధం సాగుతోంది. ఈక్రమంలోనే తాజాగా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ షాకింగ్ కామెంట్లు చేశారు. ఒక్క హిందీ భాష వల్ల ఉత్తర భారత దేశంలోని 25 భాషలు పూర్తిగా కనుమరుగు అయ్యాయని.. తమ రాష్ట్రానికి, భాషకు ఆ పరిస్థితి రానివ్వనని వివరించారు. అంతేకాకుండా ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామన్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అంతా హిందీ, ఇంగ్లీషు భాషలతో పాటు ఓ స్థానిక బాషను నేర్చుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వం త్రిభాషా విద్యా విధానాన్ని తీసుకు వచ్చింది. జాతీయ విద్యా విధానంలో భాగమైన ఈ సూత్రాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని వివరించింది. అయితే దీన్ని తమిళనాడు సర్కారు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. చాలా రోజులుగా తాము ఈ త్రిభాషా విధానాన్ని అమలు చేయమంటూనే.. బలవంతంగా ఇతర భాషలు నేర్చుకోవాలని ఇబ్బంది పెట్టొదంటూ సూచిస్తోంది. మరోవైపు బీజేపీ ప్రభుత్వం విద్యార్థులు అన్ని భాషలు నేర్చుకోవాలని.. అదే మంచిదని చెబుతోంది.ఇలా ఈ రెండు ప్రభుత్వాల మధ్య చాలా రోజులుగా మాటల యుద్ధం జరుగుతుండగా.. తాజాగా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దీనిపై స్పందించారు. ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెడుతూ.. హిందీ భాష ఉత్తర భారత దేశంలో ఉన్న 25 భాషలు పూర్తిగా కనుమరుగు అయ్యాయని వివరించారు. ఇతర రాష్ట్రాల సోదర, సోదరీమణులారా.. హిందీ కారణంగా ఎన్ని భారతీయ భాషలు కనుమరుగయ్యాయో ఎప్పుడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. 100 ఏళ్లలో ఉత్తర భారతంలో మొత్తంగా 25 భాషలను హిందీ పూర్తిగా నాశనం చేసిందన్నారు.భోజ్‌పురి, మైథిలీ, గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢి, సంథాలీ, అంజికా ఇలా అనేక భాషలు మనుగడ కోసం ఎదురు చూస్తున్నాయని సీఎం ఎంకే స్టాలిన్ వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్, బిహార్‌లు హిందీ రాష్ట్రాలు కావని.. వాటి అసలు భాషలు గతంలోనే కలిసిపోయాయన్నారు. తమిళనాడు రాష్ట్రానికి అలాంటి పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఈ త్రిభాషా విధానాన్ని అంగీకరించడం లేదన్నారు. ఎన్ని సమస్యలు వచ్చినా సరే తాము కేంద్ర ప్రభుత్వంపై ప్రతిఘటిస్తూనే ఉంటామన్నారు. జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడి చేస్తున్నారని వివరించారు.దీనిపై ఒక్కొక్కరూ ఒక్కో విధంగా స్పందిస్తున్నారు. కొందరు దీన్ని సమర్థిస్తుంటే మరికొందరు మాత్రం.. తమిళనాడు ప్రభుత్వంలో ఉన్న అనేక మంది నేతలు హిందీ బడులు నడిపిస్తున్నారని వివరించారు. సీఎం ఎంకే స్టాలిన్ కుటుంబ సభ్యులు కూడా పలు పాఠశాలలను నిర్వహిస్తున్నారని.. అందులో హిందీ, ఉర్దూ భాషలు మూడో భాషగా ఉన్నాయని చెప్పుకొస్తున్నారు. ఈయన చెప్పే మాటలు నమ్మొద్దు అంటూనే కామెంట్లు చేస్తున్నారు.

## మా ఉద్యోగాలు మాకు ఇప్పించండి..




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ ఇటీవలే తరచూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేయాలంటూ ఇటీవలే ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యల నుంచి.. ఉద్యోగులకు లేఆఫ్స్, ఫ్రెషర్స్ విషయంలో సంస్థ తీరు, శాలరీ హైక్‌లు వంటి కారణాలతో నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోంది. ఇప్పుడు తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది.కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు క్యాంపస్ లో శిక్షణ పొందుతున్న దాదాపు 400 మంది ట్రైనీలకు సంస్థ లేఆఫ్‌లుఇవ్వడం తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అయితే, తాజాగా ఈ వ్యవహారం ప్రధాన మంత్రి కార్యాలయానికి చేరినట్లు తెలిసింది. బలవంతపు లేఆఫ్‌లపై ట్రైనీలు పీఎంవోకు ఫిర్యాదు చేసినట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. ఈ తొలగింపులపై ప్రధానమంత్రి కార్యాలయానికి 100కు పైగా ఫిర్యాదులు అందినట్లు సమాచారం.ఈ విషయంలో జోక్యం చేసుకొని తమ ఉద్యోగాలు తమకు తిరిగి ఇప్పించాలంటూ ట్రైనీలు కోరినట్లు తెలిసింది. అంతేకాదు, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరినట్లు సదరు కథనాలు నివేదిస్తున్నాయి. ఇక ఈ వ్యవహారంపై కేంద్ర కార్మిక శాఖ కూడా స్పందించినట్లు తెలిసింది. ఈ మేరకు కర్ణాటక కార్మిక శాఖకు ఫిబ్రవరి 25న నోటీసులు పంపినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ అంశంపై దర్యాప్తు చేసి కేంద్రానికి నివేదిక అందించాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది.రెండేళ్ల క్రితం ఫ్రెషర్ల పట్ల కఠిన వైఖరిని ప్రదర్శించిన ఇన్ఫీ.. గతేడాది వారిని విధుల్లోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, అందులోని కొందరు ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. ఫిబ్రవరి 7వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న దాదాపు 400 మంది ట్రైనీలకు లేఆఫ్‌లు ప్రకటించింది. వరుసగా మూడు సార్లు అంచనా పరీక్షల్లో విఫలమైన కారణంగా వారిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ట్రైనీలను 50 మందితో కూడిన బ్యాచ్‌లుగా పిలిచి వారితో మ్యూచువల్ సెపరేషన్ లెటర్లపై సంతకాలు చేయించుకున్నట్లు వార్తలు వచ్చాయి. సాయంత్రం 6 గంటల్లోపు ట్రైనీలంతా క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసింది. అయితే, ట్రైనీల తొలగింపుపై ఇన్ఫీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. లేఆఫ్‌లకు గురైన ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. లేఆఫ్‌లకు గురైన ట్రైనీలు తాజాగా ప్రధాని కార్యాలయం తలుపులు తట్టినట్లు తెలుస్తోంది.

## మహా శివరాత్రి ఊరేగింపులో 'లవ్ జిహాద్' శకటం.. బజరంగ్ దళ్ చర్యపై దుమారం


**పాట్నా-నవభూమి:** మహా శివరాత్రిని పురస్కరించుకుని భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శకటాలను ప్రదర్శించారు. అయితే బజరంగ్ దళ్ ఏర్పాటు చేసిన 'లవ్ జిహాద్' శకటంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఎన్డీయే పాలిత రాష్ట్రమైన బీహార్‌లో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 26న మహా శివరాత్రి సందర్భంగా ముంగేర్‌లో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. మంకేశ్వర్ నాథ్ మహాదేవ్ ఆలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. సుమారు 50కు పైగా శకటాలను ప్రదర్శించారు.కాగా, ఈ ఊరేగింపు సందర్భంగా 'లవ్ జిహాద్' పేరుతో ఒక శకటాన్ని బజరంగ్ దళ్ ప్రదర్శించింది. హిందూ యువతులపై ముస్లిం వ్యక్తుల దురాగతాలను చిత్రీకరించే బొమ్మలు, ఫ్రిజ్‌లో యువతి మృతదేహం ముక్కలు. హిందూ మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించిన వార్తాపత్రికల కటింగ్‌లు వంటివి ఆ శకటంపై ఉంచారు. 'మీరు మీ మతాన్ని వీడితే.. ముక్కలవుతారు' అన్న ప్లకార్డులను కూడా ప్రదర్శించారు.మరోవైపు బజరంగ్ దళ్ ప్రదర్శించిన 'లవ్ జిహాద్' శకటంపై రాజకీయంగా దుమారం చెలరేగింది. ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. మత సామరస్యాన్ని కాపాడటంలో అధికార జేడీ(యూ) విఫలమైందని ఆర్జేడీ నేత మృత్యుంజయ్ తివారీ ఆరోపించారు. 'వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం జరుగుతోంది. అల్లర్లను రెచ్చగొట్టడానికి కుట్ర జరుగుతోంది. శివరాత్రి రోజున 'లవ్ జిహాద్' థీమ్ ఎందుకు ప్రదర్శించారు? బీహార్‌లో హిందూ, ముస్లింల మధ్య సంఘర్షణ లేదని నితీష్ కుమార్ అంటున్నారు. కానీ బజరంగ్ దళ్-బీజేపీ శకటాన్ని జేడీ(యూ) వ్యతిరేకిస్తుందా?' అని ప్రశ్నించారు. అయితే అధికార ఎన్డీయే కూటమిలోని పార్టీలు బజరంగ్ దళ్ 'లవ్ జిహాద్' శకటం ప్రదర్శనను సమర్థించాయి. ఈ ప్రదర్శనలో చాలా శకటాలున్నాయని, ఈ ఒక్క దానినే ప్రశ్నించడం సరికాదని ఎల్జేపీ (ఆర్) నేత ధీరేంద్ర మున్నా అన్నారు. బీహార్‌లో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని తెలిపారు.

## 97వ ఆస్కార్ వేడుకకు... ఇక 4 రోజులే

**లాస్ ఏంజెలిస్-నవభూమి:** సినిమా అభిమానులను అలరిస్తూ ఆస్కార్ 2025)అవార్డుల వేడుక సాగనుంది. ప్రపంచవ్యాప్తంగా సినిమాలకు సంబంధించి ఎన్ని అవార్డులు ప్రకటిస్తున్నా, అమెరికాలోని లాస్ ఏంజెలిస్ కేంద్రంగా సాగే అకాడమీ అవార్డుల వేడుక తీరే వేరు. సినిమాలంటే అంతగా ఆసక్తి చూపించని వారు సైతం ఆస్కార్ అవార్డుల వేడుకను కళ్ళింతలు చేసుకొని చూస్తారంటే అతిశయోక్తి కాదు. అంతలా ఆకర్షించే 97వ ఆస్కార్ అవార్డుల వేడుక భారతీయ కాలమానం ప్రకారం ఈ సంవత్సరం మార్చి 3వ తేదీ ఉదయం 5 గంటల నుండి జరగనుంది. వాస్తవానికి అమెరికాలో మార్చి 2వ తేదీ ఆదివారం సాయంకాలం నుండే సందడి సాగనుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





## ఆ కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు..

**న్యూఢిల్లీ-నవభూమి:**రాయచూరు(బెంగళూరు): మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో జరిగిన అవకతవకల విషయంతో తనకు ఎలాంటి సంబంధం లేదని పూర్వపు మైసూరు జిల్లాధికారి ప్రస్తుతం రాయచూరు ఎంపీగా ఉన్న జీ కుమార్‌నాయక స్పష్టం చేశారు. బుదవారం నగరంలో విలేకరులతో మాట్లాడిన కుమార్ నాయక్, ముడా అవినీతి వ్యవహారానికి సంబంధించి లోకాయుక్త నుంచి తనకు ఎలాంటి సమాచారం గాని నోటీసు అందలేదన్నారు.కాగా ఈ కేసు జరిగిన సందర్భంలో తాను మైసూరు జిల్లాధికారిగా పని చేయలేదని అప్పటికే తానింకా బెళగావిలో జడ్పీ సీఈఓగానే విధులు నిర్వహిస్తున్నట్లు కుమార్ నాయక్ వివరించారు. అదే సమయంలో ముడా వ్యవహారంలో డీనోటిఫికేషన్ పూర్తి నిబంధనల మేరకే సాగిందంటు పలు ఉదామరణలను నిబంధనలను కుమార్ నాయక్ వివరించారు. డీనోటిఫికేషన్ వ్యవహారంలో అవినీతి జరిగిందని నిబంధనల ఉల్లంఘున సాగిందని వస్తున్న వార్తలను ఖండించిన కుమార్ నాయక్ తాను మైసూరు జిల్లాధికారిగా పని చేసిన సమయంలో ఎలాంటి నిబంధనల ఉల్లంఘున జరగలేదని డీనోటిఫికేషన్ పూర్తి పారదర్శకంగానే నిబంధనల మేరకే నిర్వహించామని ఇందులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదని తెల్పి చెప్పారు.తనను రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు కోరడం హాస్యస్పదమని ఎంపీ అన్నారు. 2004లో జరిగిన వ్యవహారానికి సంబంధించి 2025లో రచ్చ చేస్తున్న నాయకులు ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తనను రాజీనామా చేయాలని కోరడం విడ్డూరమన్నారు. నమ్మకంతో ఎన్నుకున్న ప్రజలకు తాను ద్రోహం చేయనని తాను రాజీనామా చేసే ప్రసక్తే ఉండదన్నారు. తాను అసలు తప్పే చేయనప్పుడు రాజీనామా ప్రసక్తే ఉండదని ఎంపీ పేర్కొన్నారు.

## కొర్రీల కేంద్రం!

పీకల్లోతు కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను బేషరతుగా ఆదుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టడం క్రూరత్వమే! లక్షల రూపాయలు పెట్టుబడి పెడితేగాని మిర్చి సాగు సాధ్యం కాదు. నారు నాటినప్పటి నుండి పంట చేతికివచ్చేంతవరకు మిర్చి రైతుది దినదిన గండం బతుకే! చీడ, పీడలు, తెగుళ్ల బెడద ప్రతిరోజూ వెంటాడుతున్నది. వీటన్నింటిని అధిగమించి యార్డు దాకా తెచ్చిన సరుకుకు నామమాత్రపు ధర కూడా పలకకపోతే సాగు చేసిన రైతు పరిస్థితి ఏమిటి? దిక్కుతోచక ఆదుకోవాలని కోరితే, కేంద్ర ప్రభుత్వం పండిన పంటలో పావు వంతే కొంటామనడం ఏమిటి? మిగిలిన పంటను ఎవరికి అమ్ముకోవాలి? గత ఏడాది గరిష్టంగా క్వింటాకు 28 వేల రూపాయలు ధర పలికితే, ఇప్పుడు కేవలం 11,781 రూపాయల రేటు ఎలా నిర్ణయించారు. దీనికి ప్రాతిపదిక ఏమిటి? అది కూడా నెలరోజుల వరకే కొంటామని చెప్పడం ఏమిటి? ఒకసారి రైతు ఈ ధరకు పావు వంతు సరుకును అమ్మిన తరువాత మిగిలిన సరుకుకు ఎంత ధర పలుకుతుంది? ట్రేడర్లు ఎంతకు కొంటారు? అంతకన్నా తక్కువకే కదా! నెలరోజుల గడువు ముగిసిన తరువాత మార్కెట్‌కు వచ్చే సరుకు పరిస్థితి ఏమిటి? ఉదయం లేచింది మొదలు మార్కెట్ ఎకానమి సూత్రాలను వల్లించే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు టోకు కోనుగోలుదారులు ఎలా స్పందిస్తారో, ఎందుకు స్పందిస్తారో తెలియదా? జోక్యం (ఇంటర్‌వెన్షన్) పేరిట కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ విన్యాసం అంతిమంగా ట్రేడర్లకు లాభాల పంటను, రైతులకు నష్టాల మంటను మిగల్చడం కాదా? ఆర్థికంగా రాష్ట్రం అనేక కష్టాలు ఎదుర్కుంటుంటే వర్కింగ్ కేపిటల్‌ను ఏర్పాటు చేసుకోవాలనడం, ఖర్చులో సగభాగాన్ని రాష్ట్రమే భరించాలని కేంద్రం షరతులు పెట్టడం మరింత దుర్మార్గం. ఇంత నిర్దయగా కేంద్రం వ్యవహరించినా, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పడానికి సైతం సిద్ధపడకపోవడం బాధాకరం! తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ తీరుతో పలువురు అవాక్కవుతున్న పరిస్థితి!

గుంటూరు మిర్చి యార్డు నుండి చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థారులాండ్‌లకు మిర్చి ఎగుమతులు అత్యధికంగా జరుగుతాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుండి 1.79 లక్షల టన్నుల మిర్చిని చైనా దిగుమతి చేసుకుంది. వీటి విలువ 4,123 కోట్ల రూపాయలు! అయితే, అమెరికాతో అంటకాగే విధానాల్లో భాగంగా చైనాతో పాటు పలు ఇతర దేశాలకు చేసే ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టింది. ఫలితంగా ఎగుమతుల మార్కెట్ భారీ స్థాయిలో క్షీణించి, నిల్వలు పేరుకుపోయాయి. రైతాంగం ఆందోళన నేపథ్యంలో చైనాతో ఆర్డర్లను పునరుద్ధరించడానికి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ప్రయత్నించినప్పటికీ కేంద్రం నుండి సానుకూల స్పందన రాలేదని చెబుతున్నారు. కృష్ణపట్నంలోని కంటైనర్ టెర్మినల్‌ను అదాని పోర్టు యాజమాన్యం చెన్నైకు తరలించడంతో ట్రేడర్లకు ఇబ్బందులు వచ్చాయని చెబుతున్నారు. నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఎవరి ప్రయోజనాలు ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! ఏకపక్షంగా కేంద్రం అనుసరిస్తున్న ఈ తరహా విధానాలు మిర్చి రైతాంగానికి పెనుశాపంగా మారాయి.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 11,781 రూపాయలను ప్రామాణికంగా తీసుకుని గత ఏడాది ధరలతో పోలిస్తే ఎకరాకు రెండు లక్షల రూపాయల నష్టం వస్తుందని రైతులు లెక్కలు వేసి చెబుతున్నారు. ఇంత ఘోరంగా పరిస్థితులు ఉంటే, రాష్ట్రంలో ఏ రైతు కూడా కష్టాల్లో లేరని ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం చెప్పించడం మరీ దారుణం! ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాలి. తక్షణం నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దించి రైతాంగం కోరుతున్నట్లు క్వింటాకు కనీసం 20 వేల రూపాయల చొప్పున చెల్లించి, మొత్తం పంటను కొనుగోలు చేయాలి. అన్ని రకాల షరతులను ఎత్తివేయాలి. దీనికోసం అవసరమైతే కలిసివచ్చే శక్తులను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పాలక కూటమికి రాజకీయంగా ఇబ్బంది అనుకుంటే రైతులను, అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి కేంద్రం వద్దకు వెళ్లాలి. ఢిల్లీ పాలకుల మెడలు వంచి మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి.

# విలువలు లోపిస్తే పతనమే



వాల్యూ అంటే విలువ, ఒక దాని విలువ, అభిలాషణీయత మీద లేదా ఉపయోగిత మీద, ధర మీద, విలువ మీద ఆధారపడే లక్షణాలు. మరింత క్లుప్తంగా చెప్పాలంటే.... ఉన్నతమైన లేదా నిర్దిష్టమైన అభిప్రాయం ఏర్పరచుకొని ఉంటూ ప్రాధాన్యత పెరగడమే విలువను ఇచ్చేది. విలువ అనేది ఇష్టత పైనే ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఒక వస్తువు లేదా ఒక వ్యక్తిపై అనేకులకు ఇష్టత పెరిగితే ఆటోమేటిక్ గా విలువ పెరుగుతుంది. డిమాండ్ పెరుగుతుంది. ఉదాహరణకు, బంగారం అంటే అందరికీ మహా ఇష్టం కదా! దీంతో దాని ధర దూసుకుపోతుంది కదా! అయితే మనిషిని సరైన మానవుడిని చేసేవి విలువలే. వ్యక్తి, సమాజం స్థిరంగా, కరెక్టుగా ఉండాలంటే విలువలే అందుకు మూల కారణంగా ఉంటాయి. మనిషి పాటిస్తున్న మంచి విలువలే అతనికి గుర్తింపును తెస్తాయి. స్పష్టంగా చెబితే - విలువలు చక్కని మార్గదర్శకత్వాలను అందిస్తూ వ్యక్తులను సమాజాన్ని అదుపులో పెడుతుంటాయి. అంటే, విలువలే లోపిస్తే గొడవలు, సంక్షోభాలు గమనించబడుతుంటాయి. సమాజాన్ని, వ్యక్తులను అదుపులో పెట్టేవే విలువలు. విలువల గూర్చి క్లుప్తంగా.....

ఏది కోరదగినది, ఏది కోరదగనిది, గూర్చి తెలుపునదే విలువలు. ఏది ఒప్పు, ఏది ప్రధానం అని చెప్పే ప్రమేయాలే విలువలు. దీనికి చిన్న ఉదాహరణ, పసిబిడ్డ తన తల్లికి, పాల సీసాకు విలువనిస్తుంది. ఈ రెండు తన ఆకలిని తీర్చుతాయి కనుక. అదే బాల్య దశలో వచ్చేసరికి ఆట వస్తువులకు విలువనిస్తుంటారు. ఆపై కౌమార దశకు వచ్చేసరికి స్నేహితులకు విలువనిస్తుంటారు. తర్వాతి దశలో.... పెళ్లి చేసుకున్న జీవిత భాగస్వామికి, ఉద్యోగం, గృహం, ఆభరణాలు, బ్యాంకు బ్యాలెన్స్ ఇలా విలువనిస్తూ వెళ్తుంటారు.



ఇవన్నీ భౌతిక విలువలే అని గ్రహించాలి. విలువలనేవి మనం పొందాలనుకునే, సాధించాలనుకునే మనకు మనం ఏర్పాటు చేసుకునే ఆదర్శాలుగా చెప్పవచ్చు. మంచి విలువలే ఆదర్శాలుగా నిలుస్తూ సమాజంలో గుర్తింపునిస్తాయి. విలువలతో జీవించేవారు తమ జీవితాలను ఆదర్శవంతంగా, సుఖ:వంతంగా ఉంచుకోవడం మాత్రం కాకుండా సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికై పాటుపడుతుంటారు. చరిత్రలో మహానుభావుల జీవిత చరిత్రను ఒకసారి గమనించండి, విలువల వాస్తవాలు వెల్లడవుతాయి. తండ్రి మాటకు విలువనిచ్చి రాజ్యాన్ని సుఖ:భోగాలను తృణప్రాయంగా తృజించిన రాముడు ఆదర్శప్రాయుడుగా చరిత్రలో నిలిచిపోయాడు. గురువుకు గురువు మాటకు విలువనిచ్చిన ఏకలవ్యుడు చరిత్రలో నిలిచిపోయాడు. నీతి, నిజాయితీ, నిబద్ధత విలువలతో జీవించిన స్వర్గీయ లాల్ బహుదూర్ శాస్త్రి గారు ఆదర్శమూర్తిగా నిలిచిపోయారు. ఇలా కొందరు మహానుభావులు విలువలతో విలువలను కలిగి జీవించడంతోనే నేడు మనం వారి గూర్చి మననం చేసుకుంటున్నాం. విలువలు శోభాను కలిగిస్తాయి. విలువలతో జీవించే జీవితాలు గుభాలిస్తాయి. అలాంటి జీవితాలు ధన్యకరం ఇక వ్యక్తిని పరిపూర్ణుడిగా చేసేవి నైతిక విలువలు. అసత్యం, హింస, అహంకారం, పొగరు, గర్వం, స్వార్థం, అసూయ మొదలైన చెడు గుణాలు విలువలను హరించి వేస్తాయి. నాశనం చేస్తాయి. అయితే, సత్యం, ధర్మం, త్యాగం, కరుణ, దయ, శాంతి, ప్రేమ, అహింస, కృతజ్ఞతా భావన, గౌరవం, శీలం లాంటి సుగుణాలు విలువలను కలిగిస్తాయి. ఘనతను జోడిస్తాయి. విలువలు లేని, విలువలు పాటించని ఏ వ్యవస్థ అయినా ఫలాలను పొందలేదు. పొందినా వ్యర్థమే. సమాజంలో మనిషిగా గుర్తింపు నచ్చేవి విలువలే. వ్యక్తి విలువలను కలిగి ఉన్నాడంటే - సంపూర్ణ మూర్తిమత్వ లక్షణాలను కలిగి ఉన్నాడని అర్థం. సంపూర్ణ మూర్తిమత్వంలో శారీరక, భావోద్వేగ, సామాజిక, ఆధ్యాత్మిక అంశాలు ప్రస్ఫుటంగా గమనించబడు తుంటాయి. అవి అభివృద్ధి చెందుతూ ఉంటాయి. ఒక విధంగా విలువలను కచ్చితంగా వర్గీకరించడం కష్టమే. కొన్నింటి గూర్చి క్లుప్తంగా వివరించే ప్రయత్నం చేస్తా- విలువలన్నింటిలో నైతిక విలువలు అతి ముఖ్యమైనవి. నేటి సమాజంలో ఈ నైతిక విలువలు లోపించడం వల్లనే చూడకూడని చూడకూడనివి చూస్తున్నాం. చూడలేక మానసికంగా చస్తున్నాం. వినకూడనివి వింటున్నాం. అవి వినలేక తల్లడిల్లి పోతున్నాం. అనైతికత విశృంఖలంగా సమాజంలో చోటు చేసుకోవడంతో మానవీయ విలువలు కనుమరుగవుతున్నాయి. ఇదే పోకడ కొనసాగితే సృష్టి మనుగడ కష్టతర మవుతుంది. దీంతో సకల సృష్టి, పంచభూతాలు తమ తమ నిర్దిష్ట విధులను విస్మరిస్తాయి. విలువలు లోపించడం వల్లనే అతివృష్టి, అనావృష్టి, అనైతిక కార్యకలాపాలు, అక్రమాలు, అవినీతి, గమనించబడుతున్నాయి. ఇవే కొనసాగుతూ తీవ్రతరంగా మారితే... ఇక "ఖేల్ కతం దుకాణం బంద్" గా చెప్పవలసి వస్తుంది. ఏమాత్రం జవాబుదారీతనం, కృతజ్ఞతాభావం, లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రతి పనీ, ప్రతి ఆలోచనా ఇలా ప్రతీది విలువలను కలిగి ఉంటే వ్యవస్థ సవ్యంగా ఉంటుంది. మంచి చెడుల వివక్షత తెలుస్తూ, చెడును సంపూర్తిగా విస్మరిస్తూ, విసర్జిస్తూ మంచినే కలిగి ఉంటూ, మంచిని పెంచుతూ, పంచుతూ ఉండేవే నైతిక విలువలు. నైతిక విలువలను కలిగి ఉంటూ వాటిని పాటించే వ్యక్తులు ఖచ్చితంగా ఆదర్శప్రాయులు, వారు ధన్య జీవులు. సృష్టి వారి కోసమే ఓపికతో నడుస్తోంది. నైతిక విలువలు వ్యక్తి (మనిషి) ప్రవర్తన, నడతకు సంబంధించిన విలువలు. వినయం, విధేయత, సత్యం, న్యాయం, ధర్మం, కరుణ, సానుభూతి, నిజాయితి, సహనం, సోదరభావం, ఆత్మ నిగ్రహం, నిష్కపటం ఇవన్నీ నైతిక విలువలే. వీటిల్లో ఒక్కో విలువ గూర్చి ఒక్కో వ్యాసం మరియు ఒక్కో పుస్తకమే రాయవచ్చు. ప్రస్తుత సమాజానికి తక్షణ అవసరం ఉన్న విలువలు ఇవే. ఇవి లోపించడం వల్లనే విలువల సంక్షోభం గమనించబడుతోంది. విలువలు లేని సమాజం అజ్ఞానానికి, అశాంతికి, అంధకారానికి నిలయంగా ఉంటుంది. సమాజంలో సమత, మమత, మానవతలు లోపించడంతో "కర్ర ఉన్నవాడిదే బర్రె" అన్నట్లు ఉంటుంది. ఈ పోకడ ఏమాత్రం క్షేమకరం కాదు. వ్యక్తుల్లో స్వార్థం పతాకస్థాయికి చేరడంతో విలువలు పతనమయిపోతున్నాయి. చేసేదొకటి, చెప్పేదొకటి. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియని రోజులు. నమ్మితీరా రామన్న అంటే నట్టేట ముంచుతా లక్ష్మన్నా అన్నట్లున్నాయి ఈ రోజులు. ఇలా కడు దీనస్థితికి చేరుతున్నాయి. అన్ని, అంత కలుషితాలవుతున్నాయి. దీంతో సంక్షోభాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదే పోకడ కొనసాగితే ది ఎండ్ కార్డ్ పడుతుంది. ఈ మేరకు, వాస్తవ పరిస్థితులను గమనిస్తూ విలువలను కలిగి జీవిస్తూ, అందరిలో నైతిక విలువలను పెంచే కృషిని తక్షణం ప్రారంభించాలి. లేనిచో జరిగే పర్యవసానాలను ఏమాత్రం ఊహించలేము. ప్రగతిని సాధించలేము. విలువల గూర్చి రాసిన ఈ వ్యాసం విలువైనదిగా తక్షణ అవసరంగా భావించగలరు.

**డాక్టర్ ఎం. ప్రభుదయాల్,**
**మాజీ సెనేట్ సభ్యుడు - కాకతీయ యూనివర్సిటీ,**
**మండల విద్యాశాఖాధికారి - కొత్తగూడెం**

# ఫాస్టాగ్ పేరుతో మరో నిలువుదోపిడీ!



ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం లేని ఫాస్టాగ్ విధానం వల్ల కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ఆదాయాన్ని పొందుతోంది. 2024లో కేంద్ర ప్రభుత్వానికి టోల్‌టాక్స్‌ల ద్వారా రూ.68,037.60కోట్ల ఆదాయం లభించింది. 2023వ సంవత్సరంతో పోల్చుకొంటే ఇది 9.2 శాతం ఎక్కువ. ప్రస్తుతం రోజుకి సగటున రూ.191.14కోట్ల ఆదాయం లభిస్తోంది. ఈ దోపిడీ చాలదన్నట్టుగా ఫాస్టాగ్ అకౌంట్‌లో తగినంత డిపాజిట్ లేకపోతే వాహనాలకు రెట్టింపు రుసుము వసూలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిస్థితి చూస్తే క్రమంగా టోల్‌గేట్లు దోపిడీ కేంద్రాలుగా మారుతున్నట్టు అర్థమవుతోంది.

ఫాస్టాగ్ అకౌంట్‌లో కనీసం 100 రూపాయలు ఉండాలన్న నిబంధన వల్ల ప్రస్తుతం ఫాస్టాగ్‌లను నిర్వహిస్తున్న ఎయిర్‌టెల్, జియోలతో పాటు వివిధ ప్రైవేటు బ్యాంక్‌లకు ఉచితంగా వందల కోట్ల రూపాయలు లభిస్తాయి. 2023%-%24 లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 50 కోట్లకుపైగా నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ఈ వాహన యజమానులు ఒక్కొక్కరు తమ అకౌంట్లో కనీసం రూ.100 డిపాజిట్ చేసినా ఆయా బ్యాంక్‌లు, ఎయిర్‌టెల్ వంటి సంస్థల వద్ద ఎవరికీ ఎటువంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేని రూ.5000 కోట్ల ప్రజల డబ్బు నిలువ ఉండిపోతోంది. ఇక తగిన డిపాజిట్ లేకపోతే టోల్ రుసుము రెట్టింపు వసూలు చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. ఇవిగాక దేశవ్యాప్తంగా 2022 నాటికి దాదాపు 50 లక్షల లారీలు/గూడ్స్ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా లభించే ఆదాయం అదనం.


ఇంతఖర్చు చేసినా వాహనదారులకు మాత్రం టోల్‌గేట్‌ల వద్ద వేచి వుండే పరిస్థితి మెరుగుపడలేదు. టోల్‌గేట్ నిర్వాహకులు నాసిరకం సెన్సార్‌లు వినియోగించడం వల్ల, అవి తరచూ పనిచేయకపోవడంతో, పెద్దఎత్తున వేచివుండాల్సి వస్తోంది. పండుగల సమయంలో అయితే వాహనాలు గంటల కొద్దీ వరుసలో నిలిచిపోతున్నాయి. టోల్‌గేట్ల వద్ద వాహనాలు మూడు నిమిషాలకు మించి నిలిచి వుండే పక్షంలో టోల్ ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతారు. కానీ ఆచరణలో అమలుకావడం లేదు. పండుగల సమయంలో టోల్‌గేట్ల వద్ద గంట సేపు వేచివున్నప్పటికీ టాక్స్ వసూలు చేస్తూనే వున్నారు.

టోల్ టాక్స్ విధానం అమల్లోకి వచ్చిన సందర్భంలో దేశవ్యాప్తంగా లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేయగా, కొత్తగా నిర్మించిన రహదారులలో రహదారుల నిర్మాణం కోసం చేసిన అప్పు తీరేంత వరకు అంటే 10-15 ఏళ్లు మాత్రమే వసూలు చేస్తామని, ఆ తర్వాత టోల్ టాక్స్ వుండదని కేంద్ర ప్రభుత్వం నచ్చచెప్పింది. కాని, వాస్తవంలో 15 ఏళ్లు దాటిన తర్వాత కూడా వసూలు చేస్తూనే వున్నారు. టోల్ టాక్స్ కేంద్ర ప్రభుత్వానికి మంచి ఆదాయ వనరుగా మారడంతో టోల్ ఆదాయంపై మరింత ఆశపెరిగింది. ఇదే సమయంలో రెండేళ్ల క్రితం వరకు నాలుగు లేన్లు అంతకుమించి లేన్లు ఉన్న రహదారులకు మాత్రమే టోల్‌గేట్‌లు ఏర్పాటు చేసి రుసుము వసూలు చేసేవారు. కాని తాజాగా కేవలం రెండు లేన్ల రహదారులకు కూడా టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. యూరోపియన్ దేశాలలో టోల్ రహదారులు, సాధారణ రహదారులు కూడా వుంటాయి. వాహనదారులు సాధారణ రహదారులపై ప్రయాణం చేస్తే టోల్ టాక్స్ చెల్లించాల్సిన పనిలేదు. మన దేశంలో మనకు ఇష్టం వున్నా లేకపోయినా టోల్ టాక్స్ రహదారులపై మాత్రమే ప్రయాణం చేయాలి.

నిజానికి వాహనాలు కొనుగోలు చేసే సమయంలో 28 శాతం జీఎస్‌టీతో పాటు రోడ్ టాక్స్ కూడా వసూలు చేస్తారు. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి వాహనం ఖరీదులో 12 నుంచి 17 శాతం వరకు వసూలు చేస్తున్నారు. అంటే 20 లక్షల రూపాయల వాహనం కొంటే 2.40 నుంచి 3.40 లక్షల వరకు రోడ్డు టాక్స్ వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ఒక వాహనం వుండగా మరో వాహనం కొనుగోలు చేస్తే అదనంగా రెండు శాతం వసూలు చేస్తారు. అంటే ఇప్పటికే మనకు స్కూటర్ వుండి, కొత్తగా కారు కొనుగోలు చేస్తే లక్షకి 2 శాతం వంతున రూ.20వేలు అదనంగా వసూలు చేస్తారు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే జాతీయ రహదారుల అభివృద్ధికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇప్పటికే పెట్రోలియం ఉత్పత్తులపై రోడ్ డెవలప్‌మెంట్ సెస్‌ను విధిస్తోంది. ప్రస్తుతం ప్రజలు ప్రతి లీటర్ డీసెల్/ పెట్రోల్ ధరలో 7 రూపాయలను జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నాము. ఈ టాక్స్ ద్వారా 2022-23 సంవత్సరంలో దాదాపు రూ.22వేల కోట్లు వసూలు చేసింది. నిబంధనల ప్రకారం ఈ నిధులను రహదారులు అభివృద్ధికి విని యోగించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఈ నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. మొత్తంగా గమనిస్తే ఒక వాహనదారుడి నుంచి తొలుత రోడ్ టాక్స్, ఆ తర్వాత డిసెల్/ పెట్రోల్ ద్వారా రోడ్ సెస్ వసూలు చేయడంతో పాటు మరల జాతీయ రహదారిపైకి వస్తే టోల్ టాక్స్ అంటూ మొత్తం మూడు రకాల పన్నులను ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు.టోల్‌టాక్స్, జీఎస్‌టీ, రోడ్ టాక్స్ వంటి పన్నుల ప్రస్తావన వచ్చినప్పుడు వాహనాలనేవి ధనవంతులకు సంబంధించిన అంశమని, వీటితో సామాన్యులకు వచ్చిన ఇబ్బంది ఏమిటి? అంటూ అధికారంలో ఉన్న నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. టోల్‌టాక్స్ ధరలు సింపుల్‌గా కాకుండా వందల రూపాయలలో వుండటమే కాకుండా దూరప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తున్నప్పుడు వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ప్రత్యక్షంగా పన్నులు లారీ యజమానులు చెల్లిస్తున్నట్టు కనిపిస్తున్నప్పటికీ పరోక్షంగా ఆ రవాణా ఖర్చుల భారం సరుకుల ధరలపై పడటం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే సమయంలో అఖిల భారత లారీ యజమానుల సంఘం వారు టోల్‌గేట్లు ఎత్తి వేయాలని, టోల్‌టాక్స్ ద్వారా వచ్చే ఆదాయాన్ని డీసెల్/ పెట్రోల్ ధరను పెంచడం ద్వారా పొందాలని కోరుతున్నారు. ఈ కారణంగా సరుకుల చేరవేతలో సమయం చాలా కలసి వస్తుందని వారు అంటున్నారు. లారీ యజమానులు ఎటువంటి రాయితీ కోరడం లేదు, టోల్‌గేట్ల ద్వారా ఎంత ఆదాయం వస్తోందో అంతే మొత్తంలో డీసెల్/ పెట్రోల్ ధరలు పెంచి, టోల్‌గేట్లు తొలగించాలని కోరుతున్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం టోల్‌గేట్లను యథావిధిగా కొనసాగించడంలో మర్మమేమిటో అర్థం కావడం లేదు.ప్రపంచంలో మరే దేశంలో లేనివిధంగా భారతదేశంలో పెట్రోల్/ డీసెల్ లీటరు ధర మండిపోతోంది. వంట గ్యాస్ ధర నాలుగు రూపాయలు, పెట్రోల్ ధర 90 పైసలు పెరిగినప్పుడు ఖాళీ సిలెండర్లు, ఎడ్ల బండ్లు రోడ్లపైకి తీసుకువచ్చిన నేతలు గతాన్ని మరచి ధరలు పెంచుతున్నారు. దేశంవ్యాప్తంగా ఒకే విధమైన పన్ను అనే నినాదంతో జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పుడు క్రమంగా పెట్రోలియం ఉత్పతులు జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురాలేదు. కాని, ప్రజలకు ప్రయోజనం కలిగే విధంగా పెట్రోలియం ఉత్పత్తులను కూడా క్రమంగా జీఎస్‌టీ పరిధిలోకి తీసుకువస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణకు వచ్చేసరికి అదనంగా పన్నులపై పన్నులు విధిస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తోంది.

## కొమ్ముల మధ్య నుంచి శివుడిని ఎందుకు దర్శించుకొంటారు

**భక్తి**



దేవాలయాల్లో ముఖ్యంగా శివాలయాల్లో శివలింగానికి ఎదురుగా నందీశ్వరుడు ఉంటాడు. గుడి చుట్టు ప్రదక్షణ అయిన తర్వాత... భక్తుడు నందీశ్వరుడికి దణ్ణం పెట్టుకుంటాడు. అనంతరం నందీశ్వరుడి కొమ్ములపై చేతి వేళ్లు ఉంచి.. ఆ మధ్యలో నుంచి శివలింగాన్ని దర్శించుకుంటాడు. అయితే ఇలా ఎందుకు చేస్తారనే విషయం చాలా మందికి తెలియదు. అలాగే శివాలయాల్లోనే నందీశ్వరుడు ఉంటాడు. మిగిలిన దేవాలయాల్లో ఉండడు. ఓ వేళ ఉన్నా.. స్వామి వారికి ఎదురుగా ఉండదు ఇలా ఎందుకు అనే సందేహం పలువురు భక్తుల్లో వ్యక్తమవుతోంది.త్రిమూర్తుల్లో సులభంగా ప్రసన్నమయ్యే దేవుడు శివుడు. ఆయనకు భక్తులెక్కువ. ఆ కోవకే పరమ శివుడి పరమభక్తుడైన శిలాదుడి కుమారుడే నందీశ్వరుడు. ఆయన జన్మించడంతోనే ఆతడు శివభక్తుడు. ఓ వైపు సకల శాస్త్రాలు అభ్యసిస్తూనే.. మరోవైపు మహేశ్వరుడిని ధ్యానిస్తూ ఉండేవారు. అలా ఓ సారి నందీశ్వరుడు శ్రీశైలం వచ్చి తపస్సులో నిమగ్నమయ్యాడు. అతడి తపోదీక్షకు మెచ్చిన కైలాసనాథుడు ప్రత్యక్షమై.. వరం కోరుకోమన్నాడు.పది వేల ఏళ్లు తపస్సు చేసే శక్తిని ప్రసాదించాలంటూ పరమ శివుడిని కోరాడు. అలాగేనంటూ నందీశ్వరుడికి ఈశ్వరుడు వరమిచ్చాడు. అలా తపస్సు పూర్తి చేశాక.. నందికి ఈశ్వరుడు గణాధిపత్యం ప్రసాదించాడు. దీంతో అతడికి అత్యంత సన్నిహితంగా ఉండే అదృష్టాన్ని కల్పించాడు. దీంతో శ్రీశైలంలోనే కొలువు తీరేలా పరమ శివుడు అనుగ్రహించాడు. ఈ వృత్తాంతం శ్రీశైల ఖండంలో స్పష్టం చేశారు.అందుకే నంది కొమ్ముల మధ్య నుంచి పరమ శివుడిని దర్శిస్తారు.శివాలయంలో పరమశివుడి ఎదుట ఉండే నంది ధర్మ స్వరూపం.ఈ నంది నాలుగు పాదాలు.. చతుర్వేదాలకు ప్రతీక. కలియుగంలో ధర్మం ఒంటిపాదంపై నడుస్తుందనటానికి నిదర్శనంగా.. నంది ముందర కుడిపాదం పైకి లేచి ఉంటుంది. మిగిలిన మూడూ పాదాలు లోపలికి మడిచి ఉన్నట్లు కనిపిస్తాయి. ఇక సంధ్యా సమయాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో ప్రదోష కాలమని పేర్కొంటారు.

ఈ సమయంలో నందీశ్వరుడికి విశేష అర్చనలు, పూజలు చేయడం శతాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం. అయితే కాలకూట విషం తాగిన పరమేశ్వరుడు తాండవం చేస్తుంటే, ఆయన ఉగ్రత్వాన్ని నేరుగా చూసేందుకు దేవతలు భయపడ్డారు. ఈ నేపథ్యంలో నందీశ్వరుడి వెనుక నిలబడి కొమ్ముల మధ్యలోంచి శివుడిను దర్శించారని పురాణాల కథనం. నేటికీ అదే ఆనవాయితీని కొనసాగిస్తూ.. భక్తులు నంది కొమ్ముల మధ్యలోంచే స్వామిని దర్శించడం సంప్రదాయంగా వస్తోంది.



# బిజినెస్




## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. మహాశివరాత్రి పర్వదినం కావడంతో మార్కెట్లు బుధవారం మూతపడిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం మార్కెట్లు సానుకూల పవనాల మధ్య లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. చివరి సెషన్‌లో సెనెక్స్ లాభాల్లో కదలాడినా.. లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. క్రితం సెషన్ (మంగళవారం ముగింపు)తో పోలిస్తే సెన్సెక్స్ 74,706.60 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 74,520.78 కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 74,834.09 పాయింట్లకు పెరిగింది. చివరకు 10.31 పాయింట్లు పెరిగి.. 74,612.43 వద్ద ముగిసింది. నిఫ్టీ 2.50 పాయింట్లు తగ్గి.. 22,545.05 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 892 షేర్లు లాభపడ్డాయి. మరో 2,925 షేర్లు పతనమయ్యాయి. శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్ ఫార్మా, హిందాల్కో ఇండస్ట్రీస్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఆటో, టాటా మోటార్స్ నష్టపోయాయి. బ్యాంక్, మెటల్ మినహా అన్ని ఇతర రంగాల సూచీలు నష్టాల్లోనే కొనసాగాయి. ఆటో, మీడియా, ఎనర్జీ, క్యాపిటల్ గూడ్స్, రియాల్టీ, పవర్ ఒకటి నుంచి రెండుశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం తగ్గగా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2శాతం పడిపోయింది.

## హోమ్ లోన్ కావాలా.. అయితే ఎస్బీఐ కంటే తక్కువ వడ్డీ రేట్లు ఇక్కడే..




**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న నిర్ణయం గృహ రుణాల గ్రహీతలకు ఊరట కలిగిస్తోంది. అక్టోబర్ 01, 2019 తర్వాత రిటైల్ ఫ్లోటింగ్ రేటు గృహ రుణాలను రెపో రేటుకు అనుసంధానించారు. ఈ మేరకు ఆర్బీఐ రెపో రేటు తగ్గిస్తే బ్యాంకులు కూడా రేటు తగ్గింపు ప్రయోజనాన్ని రుణగ్రహీతలకు అందించాల్సి ఉంటుంది. గృహ రుణాలు తీసుకునే వారిపై ఇది భారాన్ని తగ్గిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఆర్బీఐ తాజాగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు మేర కోత విధించి 6.25 శాతానికి తగ్గించింది. దీంతో పలు బ్యాంకులు గృహ రుణాలపై వడ్డీలను తగ్గించాల్సి ఉంది.

రిజర్వ్ బ్యాంక్ నిర్ణయంతో గృహ రుణ వినియోగదారులకు రెపో రేటు తగ్గింపు ప్రయోజనాన్ని అందించిన మొదటి ప్రధాన బ్యాంకుల్లో ఒకటిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) నిలిచింది. ఎస్బీఐ తన ఫ్లోటింగ్ రేటు గృహ రుణ వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించింది. 8.25 శాతం వడ్డీతో ప్రారంభమయ్యే గృహ రుణాలను ఖాతాదారులకు అందిస్తోంది. ఇది హెచ్డీఎఫ్సీ, ఐసీఐసీఐ వంటి ప్రైవేటు బ్యాంకుల ప్రారంభ రేట్ల కంటే తక్కువ. అయితే వివిధ రుణదాతల వెబ్‌సైట్ల డేటా ప్రకారం ఫిబ్రవరి 2025లో ఆరు బ్యాంకులు ఎస్బీఐ కంటే తక్కువ వడ్డీ రేట్ల వద్ద రుణాలను అందిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రభుత్వ రంగానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 8.1 శాతం వార్షిక వడ్డీ రేటుతో ప్రారంభమయ్యే గృహ రుణాలను అందిస్తోంది. ఒక వ్యక్తి రూ.50 లక్షలను రుణంగా తీసుకుంటే నెలకు రూ.42,133 చొప్పున 20 సంవత్సరాలపాటు ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా 8.1శాతం వార్షిక వడ్డీ రేటుతో ప్రారంభమయ్యే గృహ రుణాలను అందిస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంకు 8.15 శాతం వడ్డీ రేటుతో గృహ రుణాలను అందిస్తున్నాయి. ఈ బ్యాంకుల్లో రూ.50 లక్షలను గృహ రుణంగా తీసుకుంటే రూ.42,289 నెలవారీ ఈఎంఐ చొప్పున 20 సంవత్సరాలపాటు చెల్లించాల్సి ఉంటుంది.

మరోవైపు పైన తెలిపిన ప్రభుత్వ రంగ రుణదాతలకు భిన్నంగా హెచ్డీఎఫ్సీ, యాక్సిస్, కోటక్ మహీంద్రా, ఐసీఐసీఐ వంటి ప్రైవేట్ రంగ బ్యాంకులు 8.75 శాతం వడ్డీ రేటుతో ప్రారంభమయ్యే గృహ రుణాలను అందిస్తున్నాయి. ఈ రేటు వద్ద రూ.50 లక్షలు గృహ రుణంగా తీసుకుంటే 20 సంవత్సరాలపాటు నెలకు రూ.44,185 చెల్లించాలి. అయితే రుణదాతలు అందించే తుది గృహ రుణాల రేట్లు గ్రహీతల క్రెడిట్ స్కోర్‌పై ఆధారపడి మారుతూ ఉంటాయని గుర్తుంచుకోవాలి.

## 100 కోట్ల మంది భారతీయుల వద్ద ఖర్చుకు డబ్బుల్లేవ్



**ముంబై- నవభూమి:** భారత జనాభా 140 కోట్ల పైమాటే. కానీ, దాదాపు 100 కోట్ల మంది భారతీయుల సంపాదన అంతంత మాత్రమేనని.. స్వేచ్ఛగా ఖర్చు చేసేందుకు వారి దగ్గర డబ్బు లేదని వెంచర్ క్యాపిటల్ సంస్థ బ్లూమ్ వెంచర్స్ అంచనా వేసింది. దేశంలో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వినియోగదారు వర్గం సైజు కేవలం 13-14 కోట్లేనని, ఇది మెక్సికో జనాభాకు సమానమని నివేదిక పేర్కొంది. మరో 30 కోట్ల మంది ఆశావహ వినియోగదారులని, ఇప్పుడిప్పుడే తమ పర్సుల్లోంచి డబ్బులు తీయడం మొదలు పెట్టారంటోంది. అయితే, వీరు ఆచితూచి ఖర్చు చేసేవారని అంటోంది. నివేదికలోని మరిన్ని విషయాలు..ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో ఇప్పుడున్న వినియోగదారు వర్గం ఆర్థికంగా మరింతగా వృద్ధి చెందుతున్నంతగా ఈ వర్గం సైజు మాత్రం విస్తరించడం లేదు. అంటే, సంపన్నుల సంఖ్య పెరగట్లేదు. ధనవంతులే మరింత సిరిమంతులవుతున్నారట. ఇది భారత వినియోగదారు మార్కెట్ దిశను మారుస్తోంది. ముఖ్యంగా ప్రీమియమైజేషన్ ట్రెండ్ పెరుగుతోంది.చాలా బ్రాండ్లు విస్తృత ప్రజానీకం కొనగలిగే ఉత్పత్తులకు బదులు ధనవంతులైన వారి కోసం ఖరీదైన, అప్‌గ్రేడెడ్ ఉత్పత్తుల విక్రయంపైనే ప్రధానంగా దృష్టిసారిస్తున్నాయి. అత్యంత విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీల్లో గృహాలు, ఐఫోన్ వంటి ప్రీమియం మొబైల్స్ విక్రయాల్లో అనూహ్య వృద్ధే ఇందుకు నిదర్శనం. దేశీయ స్థిరాస్తి మార్కెట్లో అందుబాటు ధరలో లభించే గృహాల ప్రాజెక్టుల వాటా ఐదేళ్ల క్రితం 40 శాతంగా ఉండగా.. ఇప్పుడది 18 శాతానికి తగ్గింది. మార్కెట్లో బ్రాండెడ్ ఉత్పత్తుల మార్కెట్ వాటా వేగంగా పెరుగుతోంది.మంచి అనుభూతిని పంచే ఖరీదైన సేవలకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. కోల్డ్ ప్లే, ఎడ్ షీరన్ వంటి పాశ్చాత్య గాయకులు భారత్‌లో నిర్వహించిన లైవ్ షోల టిక్కెట్లు హాట్ కేక్‌ల్లా అమ్ముడయ్యాయి.కొవిడ్ సంక్షోభం తర్వాత కాలంలో ధనవంతుల ఆస్తి మరింత పెరగగా.. పేదలు మరింత పేదరికంలోకి జారుకున్నారన్న అభిప్రాయాన్ని ఈ రిపోర్టులో వెల్లడైన విషయాలు సమర్థిస్తున్నాయి. వాస్తవానికి ఈ ట్రెండ్ కరోనా సంక్షోభానికి ముందే ప్రారంభమైంది. దేశంలో ఆర్థిక అసమానత పెరుగుతూవస్తోంది.దేశ సంపదలో 57.7 శాతం కేవలం 10 శాతం మంది భారతీయుల వద్దే కేంద్రీకృతమై ఉంది. 1990లో ఈ వాటా 34 శాతమే. కాగా, దేశ సంపదలో ఆర్థిక స్తోమత పరంగా దిగువ 50 శాతంలో ఉన్న జనాభా వాటా 22.2 శాతం నుంచి 15 శాతానికి పడిపోయింది.

## భారత్ మార్కెట్‌లోకి ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్.. ఇవీ స్పెషిఫికేషన్స్..!




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్స్ భారత్ మార్కెట్‌లోకి తన ఎంజీ కామెట్ బ్లాక్‌స్టోర్మ్ ఎడిషన్ కారును ఆవిష్కరించింది. హెక్టర్ గ్లోస్టర్ ఆస్టర్ తర్వాత ఎంజీ మోటార్స్ తీసుకొస్తున్న బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ ఎంజీ కామెంట్ నాలుగోది. టాప్ స్పెక్ ఎక్స్‌క్లూజివ్ ట్రిమ్ ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ కారు ధర రూ.7.80 లక్షలు పలికింది. ఎంజీ కామెట్‌తో పోలిస్తే ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ కారు ధర రూ.30,000 వేలు ఎక్కువ పలుకుతుంది. ఆసక్తిగల కస్టమర్లు రూ.11 వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చు. బ్లాక్ బ్యాడ్జెస్, డార్క్ క్రోమ్‌తోపాటు స్టారీ బ్లాక్ కలర్ స్కీంతో ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ కారు వస్తోంది. ఎల్ఈడీ డీఆర్ఎల్స్, అల్లాయ్ వీల్స్, డోర్లపై సైడ్ క్లాడింగ్ లోయర్ బంపర్ లిప్‌పై రెడ్ అసెంట్స్‌తోపాటు ఆల్ బ్లాక్ ఎక్స్‌టీరియర్ ఫీచర్లు ఉంటాయి. టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, డ్రైవర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోసం డ్యుయల్ 10.25 అంగుళాల డిస్‌ప్లేలు, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్ ప్లే, మాన్యువల్ ఏసీ, కీలెస్ ఎంట్రీ, పవర్డ్ ఓఆర్వీఎంస్ ఉంటాయి. నాలుగు స్పీకర్లతో కూడిన అప్‌గ్రేడెడ్ మ్యూజిక్ సిస్టమ్ ఉంటుంది. ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ ఎడిషన్ కారు ప్రయాణికుల సేఫ్టీకి ప్రాధాన్యం ఇస్తుంది. అందుకోసం రెండు ఎయిర్ బ్యాగ్స్, రివర్స్ పార్కింగ్ కెమెరా, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్ (ఈబీడీ)తోపాటు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్), ఐసో ఫిక్స్ చైల్డ్ సీట్ యాంకర్స్ ఉంటాయి.ఎంజీ కామెట్ బ్లాక్ స్టోర్మ్ కారు రేర్ వీల్ మౌంటెడ్ మోటార్‌తో వస్తున్నది. ఈ విద్యుత్ మోటార్ గరిష్ఠంగా 41 బీహెచ్‌పీ విద్యుత్, 110 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. ఈ కారులో 17.4 కిలోవాట్ల బ్యాటరీ ఉంటుంది. సింగిల్ చార్జింగ్‌తో ఈ కారు 230 కి.మీ దూరం ప్రయాణిస్తుంది.

## ఎయిర్‌టెల్-టాటా ప్లే విలీనం?




**న్యూఢిల్లీ-నవభూమి:**భారతీ ఎయిర్‌టెల్ తమ డీటీహెచ్ వ్యాపారాన్ని విలీనం చేసే దిశగా వెళ్తున్నది. టాటా ప్లేతో భారతీ టెలీమీడియా ఆధ్వర్యంలోని ఎయిర్‌టెల్ డిజిటల్ టీవీని షేర్ల మార్పిడి డీల్ ద్వారా కలపాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక టాటా ప్లే వ్యాపార కార్యకలాపాలు సైతం ఒత్తిడిలోనే ఉండగా, అందుకే ఈ ఒప్పందం అనంతరం ఏర్పడబోయే కొత్త సంస్థలో ఎయిర్‌టెల్‌కు 52-55 శాతం వాటా, టాటా ప్లే భాగస్వాములైన టాటా సన్స్, వాల్ట్ డిస్నీలకు 45-48 శాతం వాటా ఉంటుందని సమాచారం.కాగా, ఈ డీల్ తమ టెలికం, బ్రాడ్‌బ్యాండ్, డీటీహెచ్‌ల వ్యాపారాల వృద్ధికి దోహదం చేస్తుందని ఎయిర్‌టెల్ బలంగా నమ్ముతున్నది. మొత్తానికి ఇటీవలే రిలయన్స్, డిస్నీ స్టార్ ఇండియా-వయకామ్18 విలీనమై దేశీయ అతిపెద్ద మీడియా కంపెనీ జియోస్టార్‌ను తెచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎయిర్‌టెల్ డిజిటల్ టీవీ, టాటా ప్లే విలీనం ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. ఇది కుదిరితే భారతీయ డీటీహెచ్ రంగంలో మరో భారీ విలీనం చోటు చేసుకోవడం ఖాయమనే చెప్పాలి.

**ఒత్తిడిలో డీటీహెచ్**

మొన్నటిదాకా ఓ వెలుగు వెలిగిన డైరెక్ట్ టు హోమ్ (డీటీహెచ్) వ్యాపారం ఇప్పుడు మసకబారిపోయింది. ఇందుకు కారణం ఓటీటీ (ఓవర్-ది-టాప్) ట్రెండ్ పెరిగిపోవడమే. నానాటికీ పెరుగుతున్న స్మార్ట్‌టీవీల అమ్మకాలకు తగ్గట్టుగా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లూ పెరిగిపోతున్నాయి. దీంతో సంప్రదాయ డీటీహెచ్ సేవలకు పెద్దగా గిరాకీ లేకుండాపోయింది.

ఇంటర్నెట్ ప్యాకేజీలోనే ఆయా ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ కలగలసి రావ డం, డీటీహెచ్ ప్లాన్లతో పోల్చితే ధరలు తక్కువగా ఉండటంతో అంతా బ్రాడ్‌బ్యాండ్ వైపే మొగ్గు చూపుతున్నారు. కొత్తగా విడుదలైన సినిమాలు థియేటర్‌ల నుంచి నేరుగా ఓటీటీల్లోకి వస్తుండటం, వీటికి వెబ్‌సిరీస్‌లు కూడా జోడవడంతో ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవే లేకుండా పోయింది. పైగా నచ్చిన టెలివిజన్ చానళ్లనూ చూసుకునే వెసులుబాటు ఉండటంతో అంతా డీటీహెచ్‌లకు గుడ్‌బై చెప్పి బ్రాడ్‌బ్యాండ్‌కే జై కొడుతున్నారు. గత కొన్నేండ్లలో దేశవ్యాప్తంగా 12 కోట్ల నుంచి 6 కోట్లకు డీటీహెచ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య తగ్గిపోవడం ఇందుకు నిదర్శనం. 2020-21లో 7 కోట్లు గా ఉన్న డీటీహెచ్ వినియోగదారులు.. 2023 -24 (గత ఏడాది మార్చికల్లా)లో 6 కోట్లకు పడిపోయినట్టు టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ గణాంకాలు చెప్తున్నాయి మరి. ఇప్పుడు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ పరిణామాలన్నీ కూడా డీటీహెచ్ ఆపరేటర్లను ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు, పోటీ సంస్థ ల్లో విలీనాల వైపు నడిపిస్తున్నాయి. చివరకు టాటా ప్లే సైతం బింజ్ పేరిట ఓటీటీ యాప్‌ను తీసుకొచ్చిందంటే మార్కెట్‌లో ట్రెండ్ ఏ స్థాయిలో మారిందో అర్థం చేసుకోవచ్చు.

**అడ్డంకులు**

భారతీ టెలీమీడియా, టాటా ప్లే రెండింటికీ కేంద్ర ప్రభుత్వంతో లైసెన్స్ ఫీజు బకాయిల వివాదాలున్నాయి. భారతీ టెలీమీడియా రూ.5,580 కోట్లు, టాటా ప్లే రూ.3,628 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. ఈ క్రమంలో వీటి సెటిల్మెంట్, ఆ తర్వాత కంపెనీల ఆర్థిక పరిస్థితులు అన్నీ కూడా విలీనంపై ప్రభావం చూపవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి కరోనాకు ముందు టాటా ప్లే విలువ గరిష్ఠంగా 3 బిలియన్ డాలర్లు పలికింది. కానీ ఇప్పుడు 1 బిలియన్ డాలర్లకు దిగజారింది. ఇదే సమయంలో వ్యాపారం తగ్గి నష్టాలు పెరగడం, కొత్త ప్లాన్లు ఆకర్షణీయంగా ఉండకపోవడం పెద్ద లోటుగా కనిపిస్తున్నది. ప్రస్తుతం టాటా ప్లేకు 1.9 కోట్ల కస్టమర్లున్నారు. మరో 5 లక్షల బ్రాడ్‌బ్యాండ్ యూజర్లూ ఉన్నారు. విలీనంతో ఎయిర్‌టెల్‌కు ఇది కలిసిరానున్నది.

## బ్యాడ్ న్యూస్.. గోల్డ్ ధర ఎంతకు చేరిందంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:**బిజినెస్ డెస్క్: పసిడి ప్రియులకు ధరలు షాక్ ఇస్తున్నాయి. బుధవారం తగ్గినట్లే తగ్గిన గోల్డ్ రేటు గురువారంకు మళ్లీ పెరిగింది. ఇప్పటికే కొండెక్కిన ధరలు కొనుగోలుదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మరికొన్ని రోజుల్లో ధర రూ.90 వేలకు చేరే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. కాగా, https://bullions.co.in/ ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీలో నిన్న(బుధవారం) 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,421 ఉండగా.. నేడు రూ.78,678కు పెరిగింది. 24 క్యారెట్ల తులం పసిడి ధర నిన్న రూ.85,550 కాగా.. ఈరోజు రూ.85,830కు చేరుకుంది.ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర బుధవారం రూ.78,558 ఉండగా.. నేడు రూ.78,815కు పెరిగింది. అలాగే 24 క్యారెట్ల తులం పసిడి ధర నిన్న రూ.85,700 కాగా.. గురువారం రూ.85,980 వద్ద కొనసాగుతోంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో నిన్న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,678 ఉండగా.. నేడు రూ.78,943కు పెరిగింది. అలాగే 24 క్యారెట్ల తులం గోల్డ్ ధర నిన్న రూ.85,830 కాగా రూ.86,120కు చేరింది.

ప్రధాన నగరాల్లో బంగారం (22, 24 క్యారెట్ల) ధరలు ఎలా ఉన్నాయంటే..పుణె- రూ.78,815, రూ.85,980
భోపాల్- రూ.78,898, రూ.86,070
ముంబై- రూ.78,815, రూ.85,980
భువనేశ్వర్- రూ.78,833, రూ.86,000
కోయంబత్తూర్- రూ.79,044, రూ.86,230
బెంగళూరు- రూ.78,879, రూ.86,050
కోల్‌కతా- రూ.78,714, రూ.85,870
చెన్నై- రూ.79,044, రూ.86,230
జైపూర్- రూ.78,806, రూ.85,970
దిస్పూర్- రూ.78,980, రూ.86,160

వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

ఇక, దేశవ్యాప్తంగా వెండి రేట్లు సైతం భారీగానే పెరిగాయి. ఢిల్లీలో బుధవారం కిలో వెండి రూ.94,040 ఉండగా.. గురువారానికి రూ.94,920కి పెరిగింది. ముంబైలో నిన్న కేజీ వెండి రూ.94,200 కాగా.. నేడు రూ.95,090కి చేరింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో కిలో వెండి ధర నిన్న రూ.94,350 ఉండగా.. నేడు రూ.95,240 వద్ద కొనసాగుతోంది.

## పూర్ ఈవీ వినియోగదారులకు బంపర్ ఆఫర్



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని న్యూఢిల్లీ.. కాలుష్యపు కోరల్లో చిక్కుకొంది. ఇదే పరిస్థితి మిగతా మహానగరాలకు వర్తిస్తే.. పరిస్థితి దారుణంగా మారుతోంది. అలాంటి వేళ.. ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించే విధంగా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. దీంతో పలు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలు ఏర్పాటయ్యాయి. వాటిలో దిగ్గజ సంస్థ ప్యూర్ ఈవీ సదరు సంస్థ.. తమ కస్టమర్ల కోసం గొప్ప ఆఫర్‌ను తీసుకు వచ్చింది. అదీకాక వరుస పండగలు శివరాత్రి, హోలీ, ఉగాది, రంజాన్ పండగలు కూడా రావడంతో.. ఆ సంస్థ భారీ ఆఫర్‌ను ప్రకటించింది. అందులో భాగంగా.. 'ప్యూర్ పర్ఫెక్ట్ 10' అనే రిఫరల్ ప్రోగ్రాంను ఆ సంస్థ ఆవిష్కరించింది. ఇందులో వినియోగదారులను ఆకట్టుకునే క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఉన్నట్లు ఆ సంస్థ ప్రకటించింది.

**మార్చి 31 వరకు ఈ ఆఫర్..**

2025, మార్చి 31వ తేదీలోగా ప్యూర్ ఈవీ వాహనాలను కొనుగోలు చేసే కొత్త కస్టమర్లకు 'ప్యూర్ పర్ఫెక్ట్ 10' అనే రిఫరల్ ప్రోగ్రాం వర్తించనుందని తెలిపింది. అలాగే ఆయా అవుట్ లెట్స్‌లో స్టాక్స్ ఉన్నంత వరకు ఈ ఆఫర్ వర్తిస్తుందని వివరించింది. ఈ పథకం కింద ప్యూర్ ఈవీ స్కూటర్‌ను కొనుగోలు చేసేలా తమ స్నేహితులు, ఫ్యామిలీ మెంబర్స్‌ను రిఫర్ చేసే కస్టమర్లు రూ. 40 వేల క్యాష్ బ్యాక్ రివార్డులు పొంద వచ్చని పేర్కొంది.

రూ.4 వేల క్యాష్‌బ్యాక్ ఓచర్లు:

ప్రస్తుత, కొత్త ప్యూర్ ఈవీ వినియోగదారులకు వారి రిజిస్టర్డ్ వాట్సాప్ నంబరుపై 10 రిఫరల్ కోడ్‌లు వస్తాయి. రిఫర్ చేసిన వారు ప్యూర్ ఈవీని కొనుగోలు చేస్తే అలాంటి ప్రతి లావాదేవీకిగాను రిఫరర్‌కి రూ.4,000 క్యాష్‌బ్యాక్ ఓచర్‌లు లభించనున్నాయి. అయితే ఒక్కో రిఫరర్ గరిష్టంగా పది మంది వరకు కొత్త కొనుగోలుదార్లకు ఇది వర్తిస్తుంది.

**ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు..**

పర్యావరణహిత మొబిలిటీ లక్ష్య సాధనకు దోహదపడుతూనే రిఫరల్స్ ఇవ్వడం ద్వారా ఆకర్షణీయమైన క్యాష్‌బ్యాక్ ఇన్సెంటివ్‌లతో ప్రయోజనం కూడా పొందవచ్చని ప్యూర్ సహా వ్యవస్థాపకుడు, సీఈవో రోహిత్ వదేరా తెలిపారు. ఇది దేశవ్యాప్తంగా ఈవీల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించగలదని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు.

## కాసులు కురిపించిన పసిడి



**న్యూఢిల్లీ-నవభూమి:**అంతర్జాతీయ విపణిలో పసిడి ధర చుక్కలంటుతోంది. ఈ నెల ఒక దశలో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర రికార్డు స్థాయిలో 2,956 డాలర్లను (సుమారు రూ.2.57 లక్షలు) తాకింది. ప్రస్తుతం 2,915 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. గత ఏడాది పసిడి పెట్టుబడులు మదుపరులకు 27 శాతం లాభాలు పంచాయి. గత 14 సంవత్సరాల్లో బంగారంపై పెట్టుబడులు ఈ స్థాయిలో లాభాలు అందించడం ఇదే ప్రథమం. 2025 సంవత్సరంలో తొలి రెండు నెలల కాలంలోనే పసిడిలో పెట్టుబడులు మదుపరులకు 12 శాతం వరకు లాభాలు పంచాయి. ఇదే సమయంలో అమెరికా, ఆస్ట్రేలియా స్టాక్ మార్కెట్లలో మదుపు చేసిన మదుపరులకు వచ్చిన లాభం రెండు నుంచి నాలుగు శాతం మాత్రమే. భారత స్టాక్ మార్కెట్ మాత్రం మదుపరులకు 4.64 శాతం నష్టాలు మిగిల్చింది. ఈ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఔన్స్ పసిడి ధర త్వరలోనే అంతర్జాతీయ మార్కెట్‌లో 3,000 డాలర్లకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

పసిడి పరుగుకు ప్రధాన కారణాలు :
ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి.
వెంటాడుతున్న ద్రవ్యోల్బణ భయాలు.
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.
కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.
డిమాండ్‌కు తగ్గట్టు పసిడి ఉత్పత్తి, సరఫరా లేకపోవడం.
స్టాక్ మార్కెట్ అనిశ్చితితో సురక్షిత పెట్టుబడిగా మారడం.
నగలతో పాటు పారిశ్రామిక రంగంలోనూ పసిడి వినియోగం పెరగడం.
రూపాయితో సహా ప్రధాన కరెన్సీలతో పెరుగుతున్న డాలర్ మారకం రేటు.

## రూ. 108కే మంత్లీ రీఛార్జ్.. డేటాతోపాటు అన్ లిమిటెడ్ కాల్స్ కూడా..



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రభుత్వ రంగంలోని టెలికాం సంస్థ BSNL ప్రైవేటు కంపెనీలైన జియో, ఎయిర్ టెల్ వంటి సంస్థలకు గట్టి పోటీ ఇస్తోంది. ఈ క్రమంలో వినియోగదారుల కోసం అతి తక్కువ ధరల్లో ప్లాన్లను ప్రవేశపెడుతూ ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలోనే ఇటీవల ప్రవేశపెట్టిన రూ.108 ప్లాన్ గురించి తెలుసుకుందాం.

ప్రైవేట్ టెలికాం కంపెనీలు రీఛార్జ్ ధరలను పెంచిన తర్వాత టెలికాం మార్కెట్లో యూజర్ల ధోరణి క్రమంగా మారిపోయింది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ ప్లాన్ల గురించి ప్రజలు వెతకడం ప్రారంభించారు. అదే సమయంలో ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికాం కంపెనీ బీఎస్ఎన్ఎల్ యూజర్లకు అద్భుతమైన ప్లాన్లను అందిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో గత కొన్ని నెలల్లో అనేక మంది యూజర్లు ప్రైవేట్ నెట్ వర్క్‌ల నుంచి దీనివైపు ఆసక్తిచూపిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ప్రవేశపెట్టిన రూ.108 రీఛార్జ్ ప్లాన్ గురించి ఇక్కడ తెలుసుకుందాం.

ప్లాన్ వ్యవధి..

రూ. 108 ప్లాన్ వినియోగదారులకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఈ ప్లాన్ 28 రోజులపాటు చెల్లుబాటు అవుతుంది. ఈ ప్లాన్ కింద వినియోగదారులు 28 రోజుల పాటు ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత కాలింగ్ సౌకర్యాన్ని పొందుతారు. దీంతోపాటు ఈ ప్లాన్‌లో 28%+దీ% డేటా కూడా అందించబడుతుంది. అంటే వినియోగదారులు రోజుకు 1%+దీ% డేటాను పొందవచ్చు. ఇది ఇంటర్నెట్ ఉపయోగించే వారికి అనుకూలంగా ఉంటుంది. అంతేకాదు ఈ ప్యాకేజీలో 28 రోజుల వ్యవధిలో వినియోగదారులు 500 SMSలను కూడా పొందుతారు. దీని ద్వారా అవసరమైన సమయంలో మెసేజులు పంపించుకోవడానికి ఉపయోగపడుతుంది.

**29 లక్షల మంది..**

రూ. 108 ప్లాన్ ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో వినియోగదారులకు అత్యంత బెస్ట్ రీఛార్జ్ ప్లాన్ అని చెప్పవచ్చు. ఎందుకంటే ఇంత తక్కువ ధరల్లో మార్కెట్లో ఏ ఇతర కంపెనీలు కూడా ఇలాంటి సౌకర్యాలను అందించడం లేదు. ఇది కాల్స్ మాట్లాడుకునే వారితోపాటు డేటా ఉపయోగించుకునే వారికి కూడా సౌలభ్యంగా ఉంటుంది.ఇప్పటికే జూలై 2024లో ప్రకటించిన అధిక రీఛార్జ్ ఖర్చుల నుంచి దాదాపు 29 లక్షలకుపైగా వినియోగదారులు ఉపశమనం పొందారు. అంటే ప్రైవేటు నెట్ వర్క్ ల నుంచి ప్రభుత్వ యాజమాన్యంలోని బీఎస్ఎన్ఎల్‌కు మారిపోయారు. వినియోగదారుల కోసం ఈ కంపెనీలో తక్కువ ధరల్లో ప్లాన్‌లు ఉన్న నేపథ్యంలో అనేక మంది BSNL కు షిఫ్ట్ అవుతున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్
శుక్రవారం
28 । ఫిబ్రవరి । 2025

# టిక్‌టాక్‌ను ఢీకొట్టేందుకు.. రీల్స్ కోసం ఇన్‌స్టా ప్రత్యేక యాప్



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికాలో టిక్‌టాక్ ఫేమస్. కానీ ఇప్పుడు ఆ సోషల్ మీడియా యాప్ భవిష్యత్తుపై గ్యారెంటీ లేదు. అయితే ఇన్‌స్టాగ్రామ్ ఆ పరిస్థితిని వాడుకునే ప్రయత్నం చేస్తున్నది. ఇన్‌స్టాలో రీల్స్‌కు ఫుల్ క్రేజీ ఉన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియా యూజర్స్ కోసం.. ఇప్పుడు ప్రత్యేకంగా





రీల్స్ కోసం ఓ యాప్‌ను రిలీజ్ చేయాలని ఇన్‌స్టాగ్రామ్ ప్రిపరేషన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్‌స్టా ఫ్లాట్‌ఫామ్ అధినేత ఆడమ్ మొస్సేరి.. దీని గురించి ఓ ప్రకటన చేశారు. టెక్నాలజీ వార్తలను ప్రచురించే ద ఇన్ఫర్మేషన్ పత్రికలో కూడా దీనిపై స్టోరీ వచ్చినట్లు తెలుస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ పేరెంట్ కంపెనీ అయిన మెటా సంస్థ మాత్రం సపరేట్ రీల్స్ యాప్ గురించి ఇంకా ఎటువంటి స్పందన ఇవ్వలేదు.

# ఖర్జూర పండ్లలో బంగారం.. పట్టుకున్న కస్టమ్స్ ఆఫీసర్లు..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలో.. బంగారన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 172 గ్రాముల బంగారన్ని స్వాధీనం చేసుకున్నారు. 56 ఏళ్ల వయసున్న ఓ ప్రయాణికుడు.. జెడ్డా నుంచి ఢిల్లీకి వచ్చాడు. అతను ఎస్వీ-756 విమానంలో ప్రయాణించాడు. అయితే బ్యాగేజీ చెకింగ్ సమయంలో అతని లగేజీపై అనుమానం వచ్చింది. ఖర్జూర పండ్లలో బంగారాన్ని దాచి.. తీసుకెళ్తున్నట్లు కస్టమ్స్ అధికారులు అనుమానించారు.పండ్లు ఉన్న మూటను ఓపెన్ చేసి పరిశీలించారు. అయితే ఆ పండ్లలో బంగారు ముక్కలను అమర్చినట్లు గుర్తించారు. ఓ చైన్ కూడా ఆ ఖర్జూర పండ్ల బ్యాగ్‌లో ఉన్నది. ఖర్జూర పండ్లలో దాచిన ఆ బంగారం మొత్తం 172 గ్రాములు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో విచారణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

# అస్సాంను వణికించిన భూకంపం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈశాన్య రాష్ట్రమైన అస్సాం ను భూకంపం వణికించింది. మోరిగావ్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున 2:25 గంటల సమయంలో భూమి ఒక్కసారిగా కంపించింది. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 16 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొంది. అయితే, భూకంపం తీవ్రత స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. ప్రకంపనల ధాటికి భవనాలు ఊగడంతో గాఢ నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

# గిన్నిస్ రికార్డులు సృష్టించిన మహాకుంభ మేళ



**లక్నో-నవభూమి:** ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళ.. శివరాత్రి పర్వదినం (జనవరి 26వ తేదీ) వేళ.. భక్తుల శివ నామస్మరణల మధ్య ముగిసింది. జనవరి 13వ తేదీన ప్రారంభమైన ఈ మహాకుంభమేళ.. దాదాపు 45 రోజుల పాటు సాగింది. ఈ సందర్భంగా దేశ విదేశాల నుంచి వచ్చిన దాదాపు 66 కోట్ల మందికి పైగా భక్తులు.. ప్రయాగ్ రాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానమాచరించి తరించారు.

అయితే ఈ మహాకుంభమేళ 3 గిన్నిస్ రికార్డులను నమోదు చేసుకొంది. ఈ మహాకుంభమేళలో భాగంగా హ్యాండ్ పెయింటింగ్ నిర్వహించారు. ఇందులో 10,102 మంది పాల్గొన్నారు. వారంత సమైక్యత, సామాజిక సామరస్యం, సమగ్రతలో ఏకత్వం అనే స్ఫూర్తితో తమ భావాలను వ్యక్తపరిచారని మహాకుంభమేళ అధికారిక వర్గాలు తెలిపాయి. లక్షల మందితో ప్రపంచంలోనే అతి పెద్ద యోగాసానాలు వేశారు. లక్షల మంది భక్తులు ఒకే చోట చేరి.. భక్తి స్తోత్రాలను పఠించారు. ఇలా మూడు గిన్నీస్ రికార్డులను నెలకొల్పారు.

ఇక మహాకుంభమేళ ముగిసిన నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. ప్రపంచ చరిత్రలోనే ఇది అపూర్వమైనదని.. ఈ సంఘటన మరపురానిదని అభివర్ణించారు. ఈ మహా కుంభమేళ.. ఇంతటి విజయవంతం కావడానికి దార్శనికులు, సాధువులు, అఘోరాలతోపాటు మత పెద్దల ఆశీర్వాద బలమేనని ఆయన స్పష్టం చేశారు. అంతేకాదు.. ఈ కుంభమేళ అద్భుతమైన దృశ్యంగా మలిచారన్నారు. తద్వారా మొత్తం ప్రపంచానికి ఐక్యతా సందేశాన్ని ఇచ్చినట్లు అయిందన్నారు.

45 రోజుల పాటు సాగిన ఈ మహాకుంభమేళలో.. ఆరు ప్రత్యేక తేదీలు ఉన్నాయి.. జనవరి 13వ తేదీ పుష్య పౌర్ణమి, జనవరి 14 మకర సంక్రాంతి, జనవరి 29వ తేదీ మౌని అమావాస్య, ఫిబ్రవరి 3వ తేదీ వసంత పంచమి, ఫిబ్రవరి 12వ తేదీ మాఘ పూర్ణిమ, జనవరి 26వ తేదీ మహా శివరాత్రిలలో అమృత స్నానాలకు భక్తులు పోటెత్తారు.

ఈ మహాకుంభమేళలో విస్తుపోయే వాస్తవాలు..గంగానదిని నాలుగు ప్రాంతాల్లో ప్రక్షాళన చేయడం రికార్డు సృష్టించింది. ఇందులో 360 మంది పాల్గొని.. శుద్ధి చేయడం ఓ రికార్డు.2019లో జరిగిన కుంభమేళాలో 7,660 మంది పాల్గొన్నారు. ఈసారి భక్తులు లెక్కకు మిక్కిలిగా పాల్గొన్నారు.కుంభమేళ సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో 19 వేల మంది శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు. తొలుత వారి సంఖ్య 10 వేలు మాత్రమే ఉంది. కానీ వారి సంఖ్యను ప్రభుత్వం భారీగా పెంచింది. అయితే 2019లో నిర్వహించిన కుంభమేళలో వారి సంఖ్య కేవలం 10 వేల మంది మాత్రమే ఈ విధులు నిర్వహించారు. ఇది నాడు గిన్నీస్ రికార్డులో నమోదయింది.ఈ మహాకుంభమేళ ప్రపంచ అతి పెద్ద ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమమని ఉత్తరప్రదేశ్ పట్టణాభివృద్ధి, ఇంధన శాఖ మంత్రి ఏకే శర్మ తెలిపారు. ఈ మహాకుంభమేళ కార్యక్రమం ఇంతగా విజయవంతమైందంటే.. అందుకు శానిటేషన్ పనివారే కారణమని పేర్కొన్నారు. వీరు నిజమైన హీరలంటూ మంత్రి ఏకే శర్మ అభివర్ణించారు.ఈ కుంభమేళాకు ప్రతిరోజూ 1.25 కోట్ల మంది భక్తులు తరలివచ్చారు. మహాకుంభమేళలో పవిత్ర స్నానం ఆచరించడానికి దాదాపు 50 లక్షల మందికి పైగా విదేశీయులు ప్రయాగ్ రాజ్ తరలి వచ్చారు. ఇక ఈ మహాకుంభమేళకు విచ్చేసిన భక్తులు.. అమెరిక, చైనా, రష్యాలతోపాటు ఇతర దేశాలల్లోని ప్రజల మించి వీటికి హాజరయ్యారని తెలిపారు.ఇక మహాకుంభమేళకు ఐదు కోట్ల మంది భక్తులను తరలించేందుకు 16 వేలకుపైగా రైల్వే సర్వీసులను వినియోగించినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

# విజయ్ పార్టీని గెలిపించి.. తమిళనాట ధోని కంటే నేనే పాపులర్ అవుతా: ప్రశాంత్ కిషోర్



వచ్చే ఏడాది మార్చిలో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా.. తమిళగ వెట్రి కళగమ్ (టీవీకే) అధినేత, నటుడు విజయ్ ఏడాది ముందు సమర శంఖారావం పూరించారు. టీవీకే వార్షికోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 26న మహాబలిపురంలో భారీ బహిరంగ సభను విజయ్ నిర్వహించారు. ఈ సభలో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌ను పరిచయం చేసిన విజయ్.. తమ పార్టీకి ఆయన వచ్చే ఎన్నికల్లో వ్యూహకర్తగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. ఇటీవల చెన్నైలో విజయ్‌ను కలిసిన ప్రశాంత్ కిషోర్.. ఆయనతో కలిసి పనిచేయడానికి అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహాబలిపురం సభలో ప్రశాంత్ కిషోర్ ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల్లో టీవీకేను గెలిపించే బాధ్యత తనదంటూ విజయ్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. అంతేకాదు, తనను తాను మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీతో పోల్చుకున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టును ధోనీ గెలిపించినట్టు.. తాను టీవీకేను గెలిపిస్తానని హామీ ఇచ్చారు. తాను కూడా ధోనీ మాదిరే బిహార్‌కు చెందిన వాడినేనని, తమిళనాట ఆయనకు ఉన్న పాపులారిటీ తనకు బాగానే తెలుసునని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమిళనాట ధోనీ కంటే కూడా తానే ఎక్కువ పాపులర్ అవుతానంటూ ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఘన విజయాలు అందించిన ధోనీకి తమిళనాట ఉన్న క్రేజ్ గురించి వేరే చెప్పక్కర్లేదు. ఇదే విషయాన్ని పీకే తన ప్రసంగంలో పదే పదే ప్రస్తావించారు. "చెన్నై సూపర్ కింగ్స్ జట్టును ధోనీ గెలిపిస్తే%‌ా% తాను టీవీకేను ఎన్నికల్లో గెలిపిస్తాను.. అలాంటప్పుడు తాను ధోనీ కంటే తమిళనాట నేనే మోర్ పాపులర్ అయిపోతాను కదా" అని రాజకీయ వ్యూహకర్త వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ వ్యాఖ్యలకు విజయ్ అభిమానులు, టీవీకే శ్రేణులు నుంచి విశేష స్పందన మాత్రం వచ్చింది. వచ్చే ఎన్నికల్లో గెలవాలంటే టీవీకే కార్యకర్తలకు ధైర్యం, కరుణ, నిబద్ధత ఉండాలన్నారు. గుజరాత్ మోడల్ కంటే తమిళనాడు మోడలే దేశానికి ఆదర్శప్రాయంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కాగా, కిందటిసారి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీ వ్యూహకర్తగా పీకే వ్యవహరించిన విషయం తెలిసిందే. అయితే, ఐప్యాక్ నుంచి తప్పుకున్నట్టు ప్రశాంత్ కిషోర్ గతంలో ప్రకటించారు. ఇకపై తాను ఎన్నికల వ్యూహకర్తగా పనిచేయబోనని స్పష్టం చేశారు. కానీ, విజయ్ పార్టీతో ఇప్పుడు కలిసి పనిచేయడానికి సిద్ధమయ్యారు. గతంలో ప్రశాంత్ కిషోర్‌ను వైఎస్ఆర్సీపీ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేవలం పరిచయం చేసి వదిలేస్తే....విజయ్ మాత్రం మరో అడుగు ముందుకేసి ఏకంగా వేదిక మీద మాట్లాడే అవకాశం కూడా ఇవ్వడం గమనార్హం.

# యువతిపై నిర్భయ తరహాలో అత్యాచారం



**ముంబై-నవభూమి:** మహారాష్ట్రలోని పూణే నగరంలో ఇటీవల ఓ 26 ఏళ్ల యువతిపై పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే బస్సులో అత్యాచారం జరగడం.. మహారాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలకు కారణం అయింది. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపగా.. విమర్శలు, ప్రతివిమర్శలు చోటు చేసుకుం టున్నాయి. ఇక ప్రతిపక్షంలో ఉన్న ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన నేతలు.. ఘటన జరిగిన బస్టాప్‌ను కూల్చి వేశారు. బస్సులపై దాడులు చేశారు. దీంతో పరిస్థితి రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికార మహాయుతి కూటమిపై ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ తీవ్రస్థాయిలో మండిపడుతోంది.ఈ నేపథ్యంలోనే ఈ పూణే అత్యాచార ఘటనను ఉద్దేశించి మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పందించారు. సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అవసరమని తేల్చి చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో 2013లో జరిగిన నిర్భయ ఘటన తర్వాత.. మన చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. అయితే కేవలం కొత్త కొత్త కఠిన చట్టాలను తీసుకురావడంతో ఇలాంటి క్రూరమైన ఘటనలు జరగకుండా ఆపలేమని తెలిపిన జస్టిస్ డీవై చంద్రచూడ్.. మహిళల భద్రత, రక్షణ కోసం తీసుకువచ్చిన చట్టాలను సక్రమంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.

మహిళలు ఎక్కడికి వెళ్లినా.. తాము సురక్షితంగా ఉన్నాం అనే నమ్మకాన్ని వారిలో కలిగించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఇక ఇలాంటి అత్యాచార కేసుల్లో సరైన దర్యాప్తు నిర్వహించి.. నిందితులను పట్టుకుని.. వారిపై కఠిన చర్యలు తీసుకోవడం అనేది అత్యంత కీలకమని గుర్తు చేశారు. ఇందుకోసం మన న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖలపై పెద్ద బాధ్యత ఉందని తెలిపారు. పోలీసులు, చట్టాలే కాకుండా సమాజానికి కూడా బాధ్యత ఉంటుందని జస్టిస్ డీవై చంద్రచూడ్ తేల్చి చెప్పారు.పూణేలోని రద్దీగా ఉండే స్వర్‌గేట్ బస్టాప్ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున 6 గంటలకు ఈ అఘాయిత్యం చోటు చేసుకుంది. సతారా జిల్లాకు చెందిన 26 ఏళ్ల యువతి.. ఇళ్లల్లో పని చేసుకుని జీవనం సాగించేది. అయితే బస్టాప్‌లో బస్సు కోసం వెళ్లేందుకు చూస్తున్న యువతిని గమనించిన దత్తాత్రేయ రామదాస్ అనే 36 ఏళ్ల వ్యక్తి.. బస్సు కొంత దూరంలో ఉందని చెప్పి నమ్మించి.. అక్కడికి వెళ్లిన తర్వాత బస్సులో అత్యాచారానికి ఒడిగట్టాడు.ఆ బస్సు స్థానిక పోలీస్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. అతడిపై అనేక కేసులు ఉన్నాయని.. 2019లో బెయిల్‌పై బయటికి వచ్చినట్లు తేల్చారు. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు 8 స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. అయితే నిందితుడికి సంబంధించి ఫోటోను విడుదల చేసిన పోలీసులు.. అతడిపై రూ.1 లక్ష రివార్డును ప్రకటించారు.

# ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహాశివరాత్రి వేడుకల్లో చారిత్రాత్మక ఘట్టం.. సోమనాథ శివలింగాలు ఆవిష్కరణ



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా జరుగుతున్న మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.. బెంగుళూ రులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలోనూ వేడుకల్ని నిర్వహించారు. మహాశివరాత్రి రోజు ఒక అపురూప ఘట్టాన్ని ఆవిష్కరించారు. వెయ్యి ఏళ్ల నాటి అసలైన సోమనాథ శివలింగపు శకలాలను ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండర్ గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ఆవిష్కరించారు. ఈ చారిత్రాత్మ ఘట్టాన్ని 180 దేశాల నుంచి భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయ, పార్లమెంటరీ శాఖల మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు.

**ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహాశివరాత్రి వేడుకలు.**

గతంలో, వర్తమానంలో, భవిష్యత్తులో ఉండే సమస్త విశ్వపు సారమే శివం అన్నారు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్. 'ఈ శివరాత్రికి మీరు శరణు పొందండి, సమస్త విశ్వంతో ఏకమైన అనుభూతిని పొందండి, పరమశివుడు మిమ్మల్ని స్వీకరిస్తారు. మీరు శివుడి లోపల కూర్చుని ఉన్న అనుభూతిని పొందండి' అన్నారు. గురుదేవులు శివుడికి ఉన్న సృష్టి, స్థితి లయ, ఆశీస్సు, రహస్య అనే ఐదు తత్వాలను వివరించారు. 'శివుని ఆశీస్సులను, అనంత శక్తిని అనుభూతి చెందటమే శివరాత్రి. మనం ఆ తరంగాలలో మునిగి, మన లోపలకు వెళతాము. ఈనాటి కార్యక్రమంలో ప్రత్యేకంగా చెప్పుకోదగినది పురాతన సోమనాథ జ్యోతిర్లింగపు శకలాల దర్శనం. ద్వాదశ జ్యోతిర్లింగాలలో మొదటిదిగా పేర్కొనబడే ఈ లింగం ఎల్లప్పుడూ ఒక మహిమాన్వితమైన అద్భుతంగా, భక్తి భావనను రేకెత్తిస్తూ వచ్చింది. ఈ లింగం భూమికి రెండు అడుగుల ఎత్తున గాలిలో తేలుతూ దర్శనమిచ్చేదని ప్రాచీన గ్రంథాలలో చెప్పబడింది' అని వివరించారు.

**ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహాశివరాత్రి వేడుకలు**

ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహాశివరాత్రి వేడుకల్లో చారిత్రక ఘట్టం


'సోమనాథ దేవాలయం, అక్కడి జ్యోతిర్లింగం మహమ్మదు ఘజినీ దండయాత్రలో నాశమైనపుడు ఈ లింగపు శకలాలను అక్కడి బ్రాహ్మణులు జాగ్రత్తగా సేకరించి తమతో తమిళనాడుకు తీసుకెళ్లి.. వాటిని చిన్న లింగాలుగా తయారుచేసి పూజిస్తూ వచ్చారు. తరతరాలుగా వారి వంశాలలో రహస్యంగా పూజింపబడుతూ, సంరక్షింపబడుతూ వెయ్యి ఏళ్ల పాటూ వాటిని కాపాడుతూ వచ్చారు. ఒక శతాబ్ది క్రితం ప్రణవేంద్ర సరస్వతి స్వామి ఆ లింగాలను కంచి శంకరాచార్య స్వామి చంద్రశేఖరేంద్ర సరస్వతివారి వద్దకు తీసుకువచ్చారు. వాటిని మరొక నూరు సంవత్సరాల పాటు జాగ్రత్తగా దాచి ఉంచవలసిందిగా వారికి స్వామి సూచించారు'అని చెప్పుకొచ్చారు.

**ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహాశివరాత్రి వేడుకలు**

'అంతిమంగా ఆ క్షణం రానేవచ్చింది. ఈ సంవత్సరం, ప్రస్తుత తరంలో వాటిని సంరక్షిస్తున్న పండిట్ సీతారామ్ శాస్త్రి, వాటి విషయమై ప్రస్తుత కంచి శంకరాచార్యుల సలహాను కోరారు. బెంగుళూరులో గురుదేవ్ శ్రీశ్రీ రవిశకర్ అని ఒక సాధువు ఉన్నారు.. వారితో మాట్లాడండి అని శంకరాచార్య సూచించారు. ఆ ప్రకారం ఈ ఏడాది జనవరి నెలలో ఈ పవిత్ర లింగాలు నా పవిత్ర హస్తాలకు చేరాయి. వాటి పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వెంటనే గుర్తించి ప్రజల దర్శనార్థమై ఉంచి, సనాతనధర్మానికి ప్రతీకగా నిలచిన ఈ లింగాలను లక్షలాది ప్రజలు దర్శించుకునే భాగ్యం కల్పించాను. ఈ లింగాలను తిరిగి కనుగొనడం అంటే కేవలం చరిత్రను తిరగదోడటం కాదు, ఇది మన నాగరికత వెనుక ఉన్న స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయటం. సనాతన ధర్మం అనంతకాలం నుండీ ఉన్నదనే సత్యాన్ని ఇది దృఢపరుస్తుంది. ఇది గతానికి చెందిన ఒక ప్రాచీన శకలం కాదు, ఎల్లప్పుడూ సజీవంగా, నిత్యనూతనంగా తనను తాను ఆవిష్కరించుకుంటూ.. కాలానికి అతీతంగా నిలబడిన సంస్కృతికి గుర్తు' అన్నారు శ్రీశ్రీ రవిశంకర్.

**ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహాశివరాత్రి వేడుకలు**

బెంగుళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ ఆశ్రమ ప్రాంగణంలో లింగోద్దవ కాలమైన అర్ధరాత్రి సమీపిస్తుండగా దివ్యానుభూతులతో నిండిపోయింది. లక్షలాది భక్తుల ఓం నమశ్శివాయ మంత్రోచ్చారణ ప్రతిధ్వనిస్తుండగా గురుదేవులు వారితో ధ్యానం చేయించారు. శ్రీరుద్ర పఠనం, వైదిక కార్యక్రమాలు, ఉర్రూతలూగించే భక్తి సంగీతంతో ప్రపంచవ్యాప్తంగా భక్తులను భక్తిపారవశ్యంలోకి తీసుకెళ్లాయి. మహాశివరాత్రి వేడుకలలో భక్తిసంగీతం మరింత ప్రత్యేకంగా నిలిచింది. గ్రామీ అవార్డుకు నామినేట్ అయిన కళాకారిణి రాజా కుమారి తన భక్తి సంగీతంలో అలరించారు. అలాగే సాథో-ది బ్యాండ్, అభంగా-రీపోస్ట్, నిర్వాణ స్టేషన్ వంటి భారతీయ బ్యాండ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. భారతీయ శాస్త్రీయ సంగీతానికి సరికొత్త ఊపిరిగా నిలిచి.. సంప్రదాయాన్ని నిత్యనూతన విధానాలలో ఆవిష్కరించాయి.ఉదయాన్నే ఇక్కడి ఆశ్రమ ప్రాంగణంలో శివాలయంలో అభిషేకాలతో ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరైన లక్షలాది భక్తులకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు మహాప్రసాదాన్ని అందించారు. చీకట్లు అలముకున్న వేళ భక్తుల మనసులు నిశ్శబ్దమై, ప్రశాంతమై, సంపూర్ణమై, భక్తి, కృతజ్ఞతలతో నిండిపోయాయి. ఈ మహాశివరాత్రి చరిత్ర సృష్టించబోతున్న రోజుగా చెప్పాలి.. సోమనాథ్ లోని తమ స్వస్థలంలోప్రతిష్ఠించబడే ముందు ఇక్కడ పునరుద్ధరించిన జ్యోతిర్లింగపు శకలాలు, భక్తి విశ్వాసాలకు, అనంతమైన శక్తికి ప్రతీకలుగా నిలచిన సనాతన ధర్మాన్ని మరలా ఆవిష్కరించాయి.



# సునీత ఆరు నెలల క్రితం విడాకులకోసం దరఖాస్తు చేసుకున్నారు : లాయర్



**ముంబై-నవభూమి:** బాలీవుడ్ దిగ్గజ నటుడు గోవిందా తన భార్య సునీత అహుజా తో విడాకులు తీసుకుంటున్నట్లు తెగ ప్రచారంజరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విడాకుల అంశంపై దంపతుల న్యాయవాది లలిత్ బిందాల్ తాజాగా స్పందించారు. సునీత ఆరు నెలల క్రితం విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అయితే, ఇప్పుడు ఇద్దరూ రాజీపడి కలిసి ఉంటున్నట్లు స్పష్టం చేశారు.గోవింద-సునీత జంటకు న్యాయవాది లలిత్ బిందాల్ సన్నిహిత మిత్రుడు. ఈ నేపథ్యంలో ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విడాకుల అంశంపై ఆయన మాట్లాడారు. 'సునీత విడాకుల కోసం ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకుంది. అయితే, ఆ తర్వాత ఇద్దరూ రాజీకి వచ్చారు. సమస్యను పరిష్కరించుకొని కలిసే ఉండాలని నిర్ణయించుకున్నారు. ఇటీవలే నూతన సంవత్సర వేడుకల కోసం నేపాల్‌కు వెళ్లారు. అక్కడ పశుపతినాథ్ మందిరంలో పూజలు కూడా చేశారు. ప్రస్తుతం ఇద్దరి మధ్యా ఎలాంటి విభేధాలూ లేవు. అంతా బాగానే ఉంది. జంటల మధ్య ఇలాంటివి జరగడం సహజమే. ఇప్పుడు ఇద్దరూ బలంగా ఉన్నారు. ఇకపై కలిసే ఉంటారు' అని వివరించారు.

1987 మార్చి 11న పెళ్లి చేసుకున్న ఈ జంట తమ 37 ఏండ్ల వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నట్లు గత రెండు రోజులుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. గోవిందా - సునీత అహుజా కొంతకాలంగా విడిగా జీవిస్తున్నారని, వారి వైవాహిక జీవితంలో తలెత్తిన కొన్ని సమస్యల కారణంగా విడాకుల వైపు అడుగులు వేస్తున్నారని వార్తలు వచ్చాయి. రీసెంట్‌గా ఒక ఇంటర్వ్యూలో కూడా సునీత మాట్లాడుతూ.. తాను, గోవిందా వేర్వేరు ఇళ్లలో నివసిస్తున్నట్లు చెప్పారు.అంతేకాదు, తాను ఒక ఫ్లాట్‌లో తన పిల్లలతో ఉంటుండగా, గోవిందా ఎదురుగా ఉన్న బంగళాలో నివసిస్తున్నారని వెల్లడించారు. దీంతో వీరిద్దరూ విడాకులు తీసుకుబోతున్నారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి.ఇక ఈ వార్తలపై గోవిందా క్లారిటీ కూడా ఇచ్చారు. మీడియాలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. తన ఇంటికి వచ్చేవారంతా బిజినెస్ పనుల్లో భాగంగా.. సినిమా పనుల్లో భాగంగా వస్తున్నట్లు చెప్పారు. అంతేగాని విడాకుల కోసం కాదంటూ గోవిందా వెల్లడించారు.

# శివరాత్రి జాతరలో పోటీలు.. రెజ్లర్ కాల్చివేత.. దిగిన 8 బుల్లెట్లు




**ఖర్‌ఖోడా-నవభూమి:** శివరాత్రి సందర్భంగా జాతరలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఓ రెజ్లర్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన హర్యానా రాష్ట్రంలోని ఖర్ఖోడా జిల్లాలో ఉన్న కుండల్ గ్రామంలో జరిగింది. తూపాకీ కాల్పుల్లో మృతిచెందిన రెజ్లర్‌ను 35 ఏళ్ల రాకేశ్‌గా గుర్తించారు. అతను సోతి గ్రామస్థుడు. రోహ్‌తక్‌లో కుటుంబంతో అతను జీవిస్తున్నాడు. సోతి గ్రామంలో అతను ఓ రెజ్లింగ్ అకాడమీ నడిపిస్తున్నాడు.కుటుంబానికి చెందిన పాత కక్షలే అతన్ని బలి తీసుకున్నట్లు రెజ్లర్ రాకేశ్ మామ చాంద్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూమి వివాదం అంశంలో మనోజ్ అనే వ్యక్తితో గొడవలు ఉన్నాయని, గతంలోనూ మనోజ్ మరో వ్యక్తితో కలిసి రాకేశ్‌పై అటాక్ చేసినట్లు చెప్పాడు. శివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు తన కుమారుడు అమృత్, ఇతర ప్లేయర్లతో కలిసి రాకేశ్ వెళ్లాడు.కొడుకు అమృత్ బౌట్ ముగిసిన తర్వాత కారు ఎక్కేందుకు వెళ్తున్న సమయంలో.. రాకేశ్‌పై అటాక్ జరిగినట్లు ఫిర్యాదు చేశారు. మనోజ్, సాహిల్.. పిస్తోళ్లతో వచ్చిన రాకేశ్‌పై ఫైరింగ్ జరిపారు. ఆ టైంలో రోడ్డుపైకి పరుగెత్తేందుకు అతను ప్రయత్నించాడు. అయితే చేజింగ్ చేసి మరీ రాకేశ్‌ను షూట్ చేశారు. బుల్లెట్ గాయాలైన అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాకేశ్ శరీరంలోకి 8 బుల్లెట్లు దిగాయి. సోనిపట్ సివిల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

# అదో విఫలదేశం.. మాకు లెక్చర్ ఇచ్చే స్థాయిలో లేదు.. పాకిస్థాన్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన భారత్

**ఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ వేదికలపై భారత్‌పై పాకిస్థాన్ తన అక్కసును వెళ్లగక్కుతూనే ఉంది. ఈ క్రమంలో జెనీవా వేదికగా జరిగిన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 58వ సమావేశంలో భారత్‌పై పాకిస్థాన్ తీవ్ర విమర్శలు చేసింది. జమ్ము కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని పాక్ న్యాయ మంత్రి అజామ్ నజీర్ తరార్ ఆరోపించారు. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. మాకు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో ఆ దేశం లేదని స్పష్టం చేసింది.భారత రాయబారి క్షితిజ్ త్యాగి మాట్లాడుతూ.. 'పాకిస్థాన్ నాయకులు, ప్రతినిధులు వారి సైనిక ఉగ్రవాద సమూహం నిర్దేశించిన అబద్ధాలను ప్రచారం చేయడం విచారకరం. ఇస్లామిక్ దేశాల కూటమిని తన వాణిగా మార్చుకుని దుర్వినియోగానికి పాల్పడి అపహాస్యం చేస్తోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## ఆస్కార్ విన్నర్ జీన్ హ్యాక్‌మాన్ మృతి

**న్యూమెక్సికో-నవభూమి:** రెండు సార్లు అస్కార్ అవార్డు అందుకున్న జీన్ హ్యాక్‌మాన్.. అమెరికా లోని తన నివాసంలో శవమై తేలాడు. న్యూమెక్సికో లోని శాంటా ఫీ ఇంట్లో అతని మృతదేహాన్ని గుర్తించారు. ఆయన భార్య బెట్సీ అరకావా, కుక్క కూడా ఆ ఇంట్లో ప్రాణాలు కోల్పోయి ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. శాంటా ఫీ కౌంటీ పోలీసు అధికారి ఆడన్ మెండోజా ముగ్గురి మరణాలను ధ్రువీకరించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉన్నట్లు చెప్పారు. ద ఫ్రెంచ్ కనెక్షన్ చిత్రంలో నటించిన హ్యాక్‌మాన్‌కు ఆస్కార్స్‌లో బెస్ట్ యాక్టర్ అవార్డు దక్కింది. ఇక అన్‌ఫర్గీవన్ చిత్రంలో ఆయన బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ అవార్డు దక్కింది. ఆస్కార్స్‌తో పాటు 2 సార్లు బాఫ్టా, 4 గోల్డెన్ గ్లోబ్ అవార్డులు గెలుచుకున్నాడు. జీన్‌హ్యాక్‌మాన్ 1930లో కాలిఫోర్నియాలో జన్మించారు. ఆయన వందకుపైగా పాత్రలు పోషించారు. ఏ కారణం చేత హ్యాక్‌మాన్ జంట ప్రాణాలు కోల్పోయిందో తెలియదని పోలీసు అధికారి చెప్పారు. 1970, 80 దశకాల్లో రిలీజైన సూపర్‌మాన్ చిత్రాల్లో ఆయన లెక్స్ లూథర్ పాత్రను పోషించారు. రన్ అవే జ్యూరీ, ద కన్వర్జేషన్, ద రాయల్ టీనెన్‌బౌమస్ లాంటి హిట్ చిత్రాల్లో ఆయన నటించారు. 2004లో చివరిసారి ఆయన వెల్కమ్ టు మూస్‌పోర్ట్ చిత్రంలో నటించారు.



# మరో క్రేజీ ప్రాజెక్ట్‌లో బుట్టబొమ్మ



టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా నిలిచిన పూజా హెగ్డే గత ఏడాదిలో ఒక్క సినిమాతోనూ ప్రేక్షకుల ముందుకు రాలేక పోయింది. 2023లోనూ ఈమె నటించిన కిసీ కా భాయ్ కిసీ కి జాన్ సినిమా మాత్రమే విడుదల అయింది. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. దాంతో తెలుగు, హిందీ సినిమాల్లో ఇక పూజా హెగ్డేకు ఆఫర్లు దక్కడం కష్టమే అనే అభిప్రాయం వ్యక్తం అయింది. అలాంటి సమయంలో వరుసగా నాలుగు అయిదు సినిమాల్లో పూజా హెగ్డే ఆఫర్ దక్కించుకుంది. ఇటీవలే దేవా సినిమాతో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ బాలీవుడ్ మూవీ హిట్ అయితే పూజా హెగ్డే ఫేట్ మారేది. కానీ మరోసారి ఆమెకు నిరాశే మిగిలింది. బాలీవుడ్‌లో దేవా నిరాశ పరచినా ప్రస్తుతం ఆమె చేతిలో చాలా సినిమాలు ఉన్నాయి. ముఖ్యంగా సూర్య హీరోగా నటిస్తున్న రెట్రో సినిమా, విజయ్ చివరి సినిమా జన నాయగన్ సినిమాలోనూ ఈమె నటిస్తుంది. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటే కోలీవుడ్‌లో రాబోయే 3, 4సంవత్సరాలు వరుసగా సినిమా ఆఫర్లు సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు, సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమిళ్‌లో కాంచన 4, హై జవానీతో ఇష్క్ హోనా హై అనే హిందీ సినిమా లోనూ ఈ అమ్మడు నటిస్తూ ఉండగా సూపర్ స్టార్ రజనీకాంత్ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కూలీ' సినిమాలో పూజా హెగ్డే ప్రత్యేక పాటలో కనిపించబోతుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. పూజా హెగ్డే ప్రస్తుతం కూలీ సెట్స్‌లో ఉన్నట్లు ఎక్స్ ద్వారా అధికారికంగా పేర్కొన్నారు. సినిమాలో పాటకే ఈ అమ్మడు పరిమితం కానుందా లేదంటే ముఖ్య పాత్రలోనూ ఈమె కనిపించనుందా అనేది మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది. మొత్తానికి కెరీర్ ఖతం అనుకుంటున్న సమయంలో పూజా హెగ్డేకు ఇలా పెద్ద సినిమాల ఆఫర్లు ఆవడం కచ్చితంగా మంచి పరిణామం అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం టాలీవుడ్‌లో ముకుంద, ఒకలైలా కోసం సినిమాల్లో నటించింది. ఆ రెండు సినిమాలు నిరాశ పరిచిన ఆ తర్వాత నటించిన డీజే సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమా తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ముఖ్యంగా ఈ అమ్మడు నటించిన మూడు నాలుగు సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకోవడంతో స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారింది. కానీ కొన్ని కారణాల వల్ల తక్కువ సమయంకే టాలీవుడ్‌లో ఫేడ్ ఔట్ అయింది. తెలుగులో ఈమె చివరగా రాధేశ్యామ్, ఆచార్య సినిమాలో నటించింది. ఆ సినిమా నిరాశ పరచడం తో ఆఫర్లు పూర్తిగా కనుమరుగు అయ్యాయి అనేది సినీ విశ్లేషకుల అభిప్రాయం.

# పుట్టబోయే పిల్లల గురించి కూడా ట్రోల్ చేస్తున్నారు

ఇండస్ట్రీకి వచ్చి ఎన్నో ఏళ్లవుతున్నా ప్రియమణికి ఇప్పటికీ వరుస అవకాశాలు వస్తూనే ఉన్నాయి. సౌత్ తో పాటూ నార్త్ లో కూడా ప్రియమణికి మంచి గుర్తింపే ఉంది. పలు సినిమాలు, సిరీస్‌లు, టీవీ షోలతో బిజీగా ఉన్న ప్రియమణి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవతున్నాయి. పెళ్లి తర్వాత తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు చెప్తున్న ప్రియమణి, తాను మతాంతర వివాహం చేసుకోవడం వల్లే తనకు ఈ సమస్యలు వచ్చినట్టు చెప్తోంది. పెళ్లి చేసుకున్నప్పటి నుంచి కొంతమంది తనను విమర్శించడమే పనిగా పెట్టుకుని టార్గెట్ చేస్తున్నారని తెలిపింది. కేవలం తనను మాత్రమే కాకుండా తన భర్తను, పుట్టబోయే పిల్లల్ని కూడా ఇందులోకి లాగుతున్నారని ప్రియమణి బాధ పడింది. ప్రియమణి 2017లోనే ముస్తాఫా రాజ్ ని పెళ్లి చేసుకుంది. 2016లో వీరిద్దరికీ ఎంగేజ్‌మెంట్ జరిగింది. నిశ్చితార్థం జరిగినప్పటి నుంచే తనకు ఆన్ లైన్ లో విమర్శలు ఎదురయ్యాయని అంటుంది ప్రియమణి. తనకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని తన వాళ్లతో చెప్తే సంతోషిస్తారనుకుంటే వారు మాత్రం తనను లవ్ జిహాది అంటూ ఇబ్బంది పెడుతూ విమర్శిస్తున్నారని ప్రియమణి చెప్తోంది. తనపై లేని పోని ట్రోల్స్ చేస్తున్న వాళ్లు, ఇంకా పుట్టని పిల్లల్ని కూడా ఇందులోకి లాగి మరీ మాట్లాడుతున్నారని, ఆ విషయం తనను ఎంతగానో బాధపెడుతుందని ప్రియమణి తెలిపింది. తన భర్త గురించి అసలేం తెలియని వారు కూడా ఆయన గురించి ఇలా నెగిటివ్ కామెంట్స్ పెట్టడాన్ని ప్రియమణి తప్పుబట్టింది. ఇప్పటికీ తన భర్తతో కలిసి ఉన్న ఫోటో పోస్ట్ చేయాలంటే ఆ ఫోటో కింద పెట్టే కామెంట్స్ వల్ల భయపడాల్సి వస్తుందని, అలాంటి కామెంట్స్ వల్ల తానెంతో ఇబ్బంది పడుతున్నట్టు ప్రియమణి వెల్లడించింది. ఇప్పటికైనా నెటిజన్లు ఆమె బాధను అర్థం చేసుకుని ఈ విషయంలో సైలెంట్ అయితే బావుంటుంది.



ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రియమణి మాత్రం తన కెరీర్ ను సాఫీగా మలచుకుని వరుస ఆఫర్లతో ఛాన్సులు అందుకుంటూ ముందుకెళ్తుంది.

## ప్రభాస్ లుక్ టెస్ట్... ఫలితం ఇదే!



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం చాలా సినిమాలు చేస్తున్నారు. ఆ సినిమాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ఏడాదిలో మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమా విడుదల కానుంది. సమ్మర్ చివరి వరకు రాజాసాబ్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమాను సైతం ఇదే ఏడాది చివరి వరకు విడుదల చేయాలని భావిస్తున్నారు. వచ్చే ఏడాది సైతం ప్రభాస్ సినిమాలు లైన్‌గా విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. స్పిరిట్, కల్కి 2, సలార్ 2 సినిమాల షూటింగ్స్ చేయాల్సి ఉండగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో సినిమాకు ప్రభాస్ ఓకే చెప్పాడు. మోక్షజ్ఞ సినిమాను క్యాన్సల్ చేసుకున్న ప్రశాంత్ వర్మ తన తదుపరి సినిమాను ప్రభాస్‌తో కన్ఫర్మ్ చేశాడని టాలీవుడ్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. జై హనుమాన్ సినిమా ముగింపు దశకు వచ్చింది. వచ్చే ఏడాదిలో సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇదే సమయంలో ప్రభాస్‌తో సినిమాకు సైతం ప్రశాంత్ వర్మ రెడీ అవుతున్నాడు. ఇటీవల సినిమా కోసం ప్రభాస్ లుక్ టెస్ట్‌కి హాజరు అయ్యాడు. సాధారణంగా ప్రభాస్ వంటి స్టార్ హీరో లుక్ టెస్ట్‌కి హాజరు కావాల్సిన అవసరం లేదు. కానీ విభిన్నమైన గెటప్‌లో కనిపించాల్సి వస్తే అప్పుడు లుక్ టెస్ట్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. రెండు మూడు వేరియేషన్స్‌లో లుక్ టెస్ట్ చేస్తారు. ప్రశాంత్ వర్మ సినిమా కోసం ప్రభాస్ లుక్ టెస్ట్ పూర్తి అయింది. ఒక లుక్‌ను ఫైనల్ చేశారు. ప్రభాస్ ఆ పాత్రకు సెట్ అవుతాడు అనే నమ్మకం ప్రశాంత్ వర్మకు కలిగిందట. అందుకే తదుపరి స్టెప్‌కి రెడీ అవుతున్నారు. హంబులే నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించబోతుందని తెలుస్తోంది. ప్రభాస్‌తో సలార్ సినిమాను నిర్మించిన ఈ నిర్మాణ సంస్థ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో భారీ బడ్జెట్ సినిమాకు రెడీ అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభాస్, ప్రశాంత్ వర్మ కాంబో మూవీ గురించి సోషల్ మీడియాలో, సినీ సర్కిల్స్‌లో రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా కథను మొదట రణ్వీర్ సింగ్‌కు ప్రశాంత్ వర్మ చెప్పాడట. గత ఏడాదిలో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రణ్వీర్ సింగ్ సినిమా చర్చలు జరిగాయి. అధికారికంగా ప్రకటన వచ్చే సమయంలో కొన్ని విభేదాల కారణంగా ప్రాజెక్ట్‌ను పక్కకు పెట్టాల్సి వచ్చింది. కారణం ఏంటి అనేది ఏ ఒక్కరూ చెప్పలేదు. కానీ ప్రశాంత్ వర్మ అదే కథను ఇప్పుడు ప్రభాస్‌కి చెప్పి ఒప్పించారని, రాక్షస్ టైటిల్‌తో ఈ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అధికారికంగా ఈ సినిమా గురించి క్లారిటీ రావాల్సి ఉంది. ప్రభాస్ ప్రస్తుతం ఉన్న బిజీ కారణంగా వచ్చే ఏడాదిలోనే ఈ సినిమా ఉండే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు ప్రశాంత్ వర్మ సైతం 'జై హనుమాన్' షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంది. కనుక వీరి కాంబో మూవీ లుక్ టెస్ట్ పాస్ అయినా పట్టాలు ఎక్కడానికి సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి.

## టాలీవుడ్‌కి మళ్లీ వస్తున్నా..!



తెలుగు ప్రేక్షకులకు కొన్నాళ్ల క్రితం 'అల్లూరి' సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ కయాదు లోహర్. ఈ అమ్మడు ఆ సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. శ్రీవిష్ణు హీరోగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో కయాదు లోహర్‌కి పెద్దగా గుర్తింపు దక్కలేదు. దాంతో టాలీవుడ్‌లో ఈ అమ్మడు ఆ తర్వాత ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయింది. ఆ సినిమా తర్వాత కోలీవుడ్‌లో ఆఫర్లు దక్కించుకున్న కయాదు ఇటీవల డ్రాగన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రదీప్ రంగనాథ్ హీరోగా రూపొందిన డ్రాగన్ సినిమా తెలుగులోనూ విడుదల అయింది. రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ పేరుతో విడుదలైన డ్రాగన్ సినిమా తెలుగులోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. డ్రాగన్ సినిమాలో కయాదు లోహర్ నటనకు తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఈ అమ్మడు తెలుగులో గతంలో ఒక సినిమా చేసింది అంటే నమ్మశక్యంగా లేదని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా ఉన్న ఈ అమ్మడు త్వరలో ఫంకీ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. తెలుగులో డ్రాగన్ సినిమాకు మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో తెలుగులో ఒక వీడియోను ఈమె షేర్ చేసింది. తెలుగు నేర్చుకుంటున్నట్లు చెప్పడంతో పాటు, తెలుగులో డ్రాగన్ సినిమాకు మంచి స్పందన ఇచ్చినందుకు గాను ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేసింది. తెలుగులో క్యూట్‌గా మాట్లాడిన ఈమె వీడియో వైరల్ అవుతోంది. కయాదు లోహర్ తన తెలుగు రీ ఎంట్రీని కన్ఫర్మ్ చేసింది. త్వరలో తెలుగులో మళ్లీ వస్తున్నాను అంటూ అధికారికంగా ప్రకటించింది. అంతే కాకుండా ముందు ముందు మరిన్ని తెలుగు సినిమాలతో వస్తాను అంటూ పేర్కొంది. తెలుగు నేర్చుకుని తెలుగులో నటించేందుకు సిద్ధం అవుతున్న కయాదు లోహర్ తెలుగులో మంచి హీరోయిన్‌గా, స్టార్‌డం దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగులో ఈ అమ్మడు నటించబోతున్న సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

## కబడ్డీ ప్లేయర్ దీపక్ హుడాపై వరకట్న వేధింపుల కేసు పెట్టిన మాజీ బాక్సింగ్ వరల్డ్ చాంపియన్ స్వీటీ బోరా..



**న్యూఢిల్లీ-నవభూమి:** అర్జున అవార్డు గ్రహీత, బాక్సింగ్‌లో మాజీ ప్రపంచ చాంపియన్ అయిన స్వీటీ బోరా వరకట్న వేధింపులను ఎదుర్కొన్నారు. ఈ మేరకు ఆమె భర్త, ఆసియా క్రీడల్లో కాంస్య పతక విజేత అయిన దీపక్ హుడాపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. భర్తతో అతని కుటుంబం వరకట్నం కోసం తనను కొట్టారని స్వీటీ ఆరోపించింది. వీరిద్దరూ 2022లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. హర్యానాలోని హిసార్‌లో హుడాపై స్వీట్ కేసు పెట్టింది. ఈ విషయంపై హిసార్ వుమెన్స్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో సీమా మాట్లాడుతూ స్వీటీ బోరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త దీపక్ హుడాపై ఈ నెల 25న ఎఫ్ఐఆర్ నమోదైందని తెలిపారు. విచారణ కోసం రావాలని రెండుమాడు సార్లు నోటీసులు ఇచ్చినా.. అతను రాలేదని తెలిపారు. అయితే, హుడాను సంప్రదించగా.. ఆరోగ్యం బాగాలేదని చెప్పినట్లు ఓ నివేదిక పేర్కొంది. తాను స్ట్రోక్ బారినపడ్డానని.. దాంతో హాజరుకాలేకపోయినట్లు జాతీయ మీడియా నివేదిక పేర్కొంది. తాను తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తానని.. తాను మాత్రం భార్యకు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయనని తెలిపాడు. దీనిపై స్వీటీని సంప్రదించగా.. స్పందించేందుకు నిరాకరించింది. హుడాపై వచ్చిన ఆరోపణలపై మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. అదనపు వరకట్నం కోసం వేధింపులకు పాల్పడడంతో పాటు దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. లగ్జరీ కారు డిమాండ్ చేశాడని.. అది నెరవేరడంతో డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని.. ఎస్‌హెచ్‌వో తెలిపారు. స్వీటీ ఫిర్యాదు మేరకు సెక్షన్ 85 కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా.. దీపక్ హుడా 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో రోహ్‌తక్ జిల్లాలోని మెహం నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యాడు. 2016 దక్షిణాసియా క్రీడల్లో బంగారు పతకం, 2014 ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన భారత కబడ్డీ జట్టు హుడా సభ్యుడు.

## నెట్ ప్రాక్టీస్‌కు రోహిత్ శర్మ దూరం.. ఆందోళనలో అభిమానులు



**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థాన్‌పై విజయం తర్వాత భారత ఆటగాళ్లు మొదటిసారి ఐసీసీ ఆకాడమీలో నెట్ ప్రాక్టీస్ చేశారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ ఆడారు. రన్నింగ్ చేశారు. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదు. కండిషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్ పర్యవేక్షణలో రోహిత్ నెమ్మదిగా జాగింగ్ మాత్రమే చేశారు. పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్‌కు తొడ కండరాల గాయం ఇబ్బంది పెట్టిందట. అందుకే ఆయన ప్రాక్టీస్ సెషన్‌లో చురుగ్గా పాల్గొనలేదట. ప్లేయర్స్ ప్రాక్టీస్ చేస్తుండగా రోహిత్ శర్మ భారత ప్రధాన కోచ్ గంభీర్, ఇతర సిబ్బందితో చర్చిస్తూ కనిపించాడు. ఈ ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ కోహ్లీ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా వంటి స్పిన్నర్లను ఎదుర్కొన్నాడు. వారి ఓవర్లలోనే ఎక్కువ సేపు ప్రాక్టీస్ చేశాడు. అలాగే టీమిండియా పేసర్ మహ్మద్ షమీ బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ బౌలింగ్ వేశాడు. షమీ వేసిన బంతులు రెండుసార్లు కోహ్లీ ప్యాడ్‌ను తాకాయి. హర్షిత్ రాణా, అర్ష్ దీప్ సింగ్ కూడా నెట్స్‌లో చెమటోడ్చారు. ఛాంపియన్స్ ట్రోఫీలో అదరగొడుతున్న శుభ్‌మన్ గిల్ మాత్రం ప్రాక్టీస్ సెషన్‌కు రాలేదు. ఇదిలావుంటే వ్యక్తిగత కారణాల వల్ల స్వదేశానికి వెళ్లిన బౌలింగ్ కోచ్ మోర్న్ మార్కెల్ తిరిగి జట్టుతో కలిశాడు. ప్రాక్టీస్ సెషన్ సమయంలో ఆయన హెడ్ కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మతో ఏదో చర్చిస్తూ కనిపించాడు.

## కన్నీళ్లు పెట్టుకున్న నంబర్ వన్ క్రికెటర్.. ఎంతటి యోధుడైనా ఓటమికి తలవంచాల్సిందే



**న్యూఢిల్లీ-నవభూమి:** గెలుపు ఇచ్చే కిక్‌ను ఆస్వాదించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ఓటమి ఇచ్చే బాధను మాత్రం తీసుకోలేరు. ఎవరూ ఓడాలని అనుకోరు. అందునా ఆటల్లో ఫెయిల్యూర్స్‌కు పెద్దగా చోటు ఉండదు. ఎంతటి ప్లేయరైనా ఓటమి వల్ల కలిగే బాధ, ఒత్తిడిని జయించడం చాలా కష్టం. ఓడినప్పుడు భావోద్వేగాలను నియంత్రించుకోవడం తోపు ఆటగాళ్లకు కూడా అసాధ్యమనే చెప్పాలి. తాజాగా ఇది మరోమారు నిరూపితమైంది. చిన్న జట్టు చేతిలో తన టీమ్ అనూహ్య పరాజయం పాలవడంతో నంబర్ వన్ క్రికెటర్ తట్టుకోలేకపోయాడు. చిన్న పిల్లాడిలా గుక్కపెట్టి ఏడ్చాడు. మరి.. ఎవరా క్రికెటర్? ఇంగ్లండ్ టాప్ బ్యాటర్ జో రూట్ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆఫ్ఘనిస్థాన్‌తో బుధవారం జరిగిన కీలక మ్యాచ్‌లో ఇంగ్లీష్ టీమ్ 8 పరుగుల స్మాల్ మార్జిన్‌తో ఓటమిపాలైంది. అల్రెడీ ఆస్ట్రేలియా చేతుల్లో ఓడిన బట్లర్ సేన.. తాజాగా ఆఫ్ఘాన్ మీదా ఓడి ఇంటికి పయనమైంది. సెమీస్‌కు ముందే ఆ టీమ్ ప్రయాణం ముగిసింది. దీంతో రూట్ బాధ తట్టుకోలేకపోయాడు. నిన్నటి మ్యాచ్‌లో అతడు 111 బంతుల్లో 120 పరుగులు చేశాడు. ఆఖరి వరకు గెలుపు కోసం పోరాడాడు. అయినా టీమ్ ఓటమి చెందడంతో బాధ తట్టుకోలేక ఏడ్చేశాడు రూట్.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**